# తొలివెలుగు

TGTEL/26/A6221

TOLE VELUGGU JATIYAPATRIKA

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం | జాతీయ పత్రిక

యాదాద్రి భువనగిరి | సంపుటి: 01 | సంచిక : 26 | శనివారం | 22-8-2026 | పేజీలు: 08 | వెల: రూ.2/-

Yadadri Bhuvanagiri | Volume:01 | Issue:26 | Saturday | 22-8-2026 | Pages:08 | Cost:2/-



విలేకరులు కావలెను

జాతీయ దిన పత్రిక తొలివెలుగు

మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.


# సీఎం టూర్‌కు కేంద్రం నో

- ఆయన అమెరికా పర్యటన షెడ్యూల్ నిబంధనలకు అనుగుణంగా లేదన్న విదేశాంగ శాఖ
- రాజకీయ కారణాలతో అనుమతిని నిరాకరిస్తున్నట్లు వెల్లడి
- ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్‌తో సీఎం ముఖాముఖి ఉన్నందునే యూఎస్ టూర్‌కు నిరాకరణ!
- యూకే పర్యటనకు మాత్రం అనుమతించినట్లు ప్రకటన  కేంద్రం నిర్ణయంపై సీఎం విస్మయం..
- అధికారుల బృందం యథావిధిగా అమెరికా వెళ్లాలని రేవంత్ ఆదేశం
- లండన్ నుంచి రేపు హైదరాబాద్‌కు సీఎం తిరిగి రాక



న్యూఢిల్లీ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం నో చెప్పింది. రాజకీయ కారణాలతో అనుమతిని నిరాకరిస్తున్నట్లు స్పష్టం చేసింది. ఆయన పర్యటన నిబంధనలకు అనుగుణంగా లేదని విదేశాంగ శాఖ వెల్లడించింది. అమెరికా, యూకే పర్యటనలకు విధివిధానాలు, ప్రొటోకాల్ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 16న కేంద్రం అనుమతి కోరారు. అయితే యూకే పర్యటనకు అనుమతిచ్చిన విదేశాంగశాఖ.. అమెరికా పర్యటనకు మాత్రం నిరాకరించింది. 'ముఖ్యమంత్రులు లేదా ఇతర ప్రముఖుల విదేశీ పర్యటనల కోసం రాజకీయ అనుమతులు ఇచ్చేందుకు విదేశాంగ శాఖ ఆయా పర్యటనలను ఎప్పటికప్పుడు మదింపు చేస్తుంది. అలాంటి వారి విదేశీ పర్యటనలు ఆయా రాజ్యాంగబద్ధ పదవులకు, పర్యటన ఉద్దేశాలకు అనుగుణంగా ఉండాలి. కానీ తెలంగాణ సీఎం అమెరికా పర్యటన అందుకు అనుగుణంగా లేదు.

- మిగతా 2వ పేజీలో



2లో

## ఆయుర్వేద చికిత్స కోసం రేపు కేరళ వెళుతున్న పవన్ కల్యాణ్

- భుజం నొప్పికి చికిత్స కోసం కేరళకు పవన్ కల్యాణ్
- శస్త్రచికిత్స తర్వాత విశ్రాంతి పెద్దగా తీసుకోకుండా విధుల్లో చేరిక
- భుజానికి వాపు, జ్వరం రావడంతో వైద్యుల సూచన
- రేపు కేరళకు బయలుదేరనున్న ఉపముఖ్యమంత్రి
- ఆయుర్వేద చికిత్సతో పూర్తిస్థాయిలో కోలుకోవడమే లక్ష్యం

## అంతరిక్ష స్టార్టప్‌లకు అండదండలు

- యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తాం
- ప్రధాని నరేంద్ర మోదీ హామీ
- స్పేస్ స్టార్టప్‌ల వ్యవస్థాపకులు, సీఈఓలతో భేటీ

2లో



# వైఎస్ జగన్‌కు హైదరాబాద్‌లో ఘన స్వాగతం..

- బేగంపేటను ముంచెత్తిన ఫ్లెక్సీల హంగామా..
- సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు కుమారుడి వివాహానికి హాజరైన జగన్
- జల విహార్ వరకు దారి పొడవునా అభిమానుల ఘనస్వాగతం
- భారీగా ఫ్లెక్సీలు, కటౌట్లు ఏర్పాటు.. జై జగన్ నినాదాలు
- చిరునవ్వుతో అందరినీ పలకరిస్తూ ముందుకు సాగిన జననేత



హైదరాబాద్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో పర్యటించారు. నగరంలోని జల విహార్ గ్రాండ్ లాన్స్‌లో జరిగిన సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు కుమారుడి వివాహ వేడుకకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులు స్నిగ్ధ, అనంత పినాక్ శర్మలను ఆశీర్వదించి, వారికి హృదయ పూర్వక వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. అక్కడున్న వారందరినీ చిరునవ్వుతో పలకరిస్తూ ముందుకు సాగారు. వైఎస్ జగన్ కాన్వాయి జల విహార్ గేటులోకి ప్రవేశించగానే పెద్ద ఎత్తున అభిమానులు

- మిగతా 2వ పేజీలో





## రికార్డు ధర పలికిన ఎకరం

- చరిత్ర తిరగరాసిన రాయదుర్గం భూముల వేలం
- దక్కించుకున్న హైదరాబాద్ సంస్థ ఎంఎస్ఎన్ రియల్టీ
- దేశంలో ఇదే ఇప్పటి వరకు పలికిన అత్యధిక ధర
- ప్లాట్--2 రూ.275 కోట్లు దాటుతుందని ప్రభుత్వం అంచనా

హైదరాబాద్: రాయదుర్గం భూముల వేలం మరోసారి వార్తల్లో నిలిచింది. భారత రియల్టీ రంగాన్ని నివ్వెరపరిచేలా ఏకంగా ఎకరా రూ.264 కోట్లు పలికింది. దేశంలో ఇదే అత్యధిక ధర కావడం విశేషం.

## ప్రణయ్ తేజ్ ఘటన నుంచి ఇంకా తేరుకోలేకపోతున్నాను

- విశాఖ చిన్నారి ప్రణయ్ తేజ్ మృతి ఘటనపై మంత్రి లోకేశ్ తీవ్ర ఆవేదన
- ఒక తండ్రిగా ఆ తల్లిదండ్రుల బాధను ఊహించలేకపోతున్నానని వ్యాఖ్య
- పాఠశాలల్లో శారీరక దండనలకు చోటులేదని స్పష్టీకరణ
- ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశం



2లో



## ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసు..
# సాదిక్ ఖాన్ దొరికాడు!

- ఏఈ కుటుంబాన్ని ఆత్మహత్యకు ప్రేరేపించిన షూటింగ్ కోచ్
- భర్తను విషమిచ్చి చంపాడని భార్య సూసైడ్ నోట్
- ప్రైవేట్ ఫొటోలతో బ్లాక్‌మెయిల్, ఆస్తుల కోసం వేధింపులు
- పరారీలో ఉన్న నిందితుడు షేక్ సాదిక్ ఖాన్
- ఐదు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్న పోలీసులు

రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన కాకినాడ ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రైఫిల్ షూటింగ్ కోచ్ షేక్ సాదిక్ ఖాన్‌ను కాకినాడ జిల్లా పోలీసులు ఢిల్లీలో అదుపులోకి తీసుకున్నారు.

- మిగతా 2వ పేజీలో



# భారత్‌ను ముంచెత్తిన చక్కెర సంక్షోభం!

- చక్కెర ధరల పెరుగుదలకు ఇథనాల్ కారణం కాదన్న కేంద్రం
- తగ్గిన ఉత్పత్తి, పండుగల డిమాండే అసలు కారణమని వెల్లడి
- గతంతో పోలిస్తే ఇథనాల్‌కు చక్కెర మళ్లింపు తగ్గిందని స్పష్టీకరణ
- ధరల నియంత్రణకు చర్యలు.. దిగుమతులకు అనుమతి

దేశీయంగా చక్కెర ఉత్పత్తి అంచనాల కంటే తగ్గడం, పండుగల సీజన్ కారణంగా డిమాండ్ పెరగడం, పంట నష్టాలు, అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలో తలెత్తిన అవాంతరాలే ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలని ప్రభుత్వం తెలిపింది. కొందరు వ్యాపారులు అక్రమంగా నిల్వలు చేయడం కూడా దీనికి దోహదం చేసిందని పేర్కొంది. గత నెల రోజుల్లోనే చక్కెర ధర గణనీయంగా పెరిగింది. జూలై 20న కిలో రూ. 48గా ఉన్న ధర, ఆగస్టు 20 నాటికి రూ. 55 మార్కును దాటింది.

- మిగతా 2వ పేజీలో

# పోలీస్ స్టేషన్ ముందు రాహుల్ గాంధీ ధర్నా..

- పెల్లెట్ గన్ బాధితుడితో కలిసి ఎఫ్ఐఆర్ కోసం డిమాండ్
- పెల్లెట్ గన్ బాధితుడితో పోలీస్ స్టేషన్‌కు రాహుల్ గాంధీ
- ఎఫ్ఐఆర్ కోసం సీనియర్ పోలీస్ అధికారి కార్యాలయం ముందు ధర్నా
- జులై 20 నిరసనల్లో పెల్లెట్లు తగిలాయని యువకుడి ఆరోపణ
- పెల్లెట్ గన్స్ వాడలేదని ఢిల్లీ పోలీసుల వాదన

పెల్లెట్ గన్ గాయాల వ్యవహారంలో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ శుక్రవారం ఢిల్లీలో ఆందోళనకు దిగారు. జులై 20న జరిగిన జెన్–జీ విద్యార్థుల నిరసనల్లో పెల్లెట్ గన్ గాయాలయ్యాయని ఆరోపిస్తున్న సాహిల్ లోచాబ్‌ను వెంటబెట్టుకుని పార్లమెంట్

- మిగతా 2వ పేజీలో



## వైఎస్ జగన్‌కు హైదరాబాద్‌లో ఘన స్వాగతం..

(మొదటి పేజీ తరువాయి)

జై జగన్.. అంటూ నినాదాలు చేస్తూ స్వాగతం పలికారు. ఆయనతో ఫొటోలు, సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు వైఎస్ జగన్ బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న సమయంలోనూ పెద్ద సంఖ్యలో అభిమానులు, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, ప్రజలు తరలి వచ్చారు. ఈ సందర్భంగా జై జగన్ నినాదాలతో ఎయిర్‌పోర్ట్ ప్రాంగణం మార్మోగింది. తమ అభిమాన నాయకుడితో కరచాలనం చేసేందుకు, మాట్లాడేందుకు పలువురు పోటీపడ్డారు. ఈ క్రమంలో పోలీసులు వారిని అదుపు చేయడం కాస్త కష్టసాధ్యంగా మారింది. ఈ నేపథ్యంలో వైఎస్ జగన్.. కరచాలనం చేసుకుంటూ.. అందరికీ అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. కాన్వాయ్ వెంట ద్విచక్ర వాహనాలపై యువత దారి పొడవునా జై జగన్ అంటూ నినాదాలు చేసుకుంటూ ముందుకుసాగారు. ఇదిలా ఉండగా వైఎస్ జగన్ రాక సందర్భంగా హైదరాబాద్ నగరంలో పలు చోట్ల అభిమానులు భారీగా ఫ్లెక్సీలు, కటౌట్లు ఏర్పాటు చేశారు. కొన్ని చోట్ల వైఎస్ జగన్‌తో పాటు కేసీఆర్, కేటీఆర్ చిత్రాలతో రూపొందించిన కటౌట్లు కనిపించాయి. 'ధీరుడు వైఎస్ జగన్‌కు స్వాగతం'.. 'వజ్రం ఎక్కడ ఉన్నా మెరుస్తుంది' అనే క్యాప్షన్‌తో ఏర్పాటైన కటౌట్లు అందరి దృష్టిని ఆకర్షించాయి. కాగా, వివాహ వేడుకలో వైఎస్సార్‌సీపీ నాయకులు వైవీ సుబ్బారెడ్డి, అయోధ్య రామిరెడ్డి, అంబటి రాంబాబు, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, గుడివాడ అమర్‌నాథ్, రోజా, కురసాల కన్నబాబు, ఆదిమూలపు సురేష్, విడదల రజిని, తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌లతో పాటు పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

## ప్రణయ్ తేజ్ ఘటన నుంచి ఇంకా తేరుకోలేకపోతున్నాను

పాఠశాల విద్యార్థి ప్రణయ్ తేజ్ మృతి ఘటనపై ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతి, ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని, క్రమశిక్షణ పేరుతో చిన్నారులపై హింసకు పాల్పడటాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన తన సోషల్ మీడియా ఖాతాలో ఒక పోస్ట్ పెట్టారు. "ఒక తండ్రిగా, విశాఖ చిన్నారి ప్రణయ్ తేజ్‌కు జరిగిన ఘటన గురించి నేను ఇంకా తేరుకోలేకపోతున్నాను. అతని తల్లిదండ్రులు అనుభవిస్తున్న బాధను ఊహించుకోలేను. మన పాఠశాలల్లో శారీరక దండనలకు ఏమాత్రం చోటు లేదు. క్రమశిక్షణ పేరుతో ఏ బిడ్డపైనా హింస జరగకూడదు" అని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ దురదృష్టకర ఘటనపై ఇప్పటికే పూర్తిస్థాయి విచారణకు ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. బాధ్యులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ తీవ్రమైన దుఃఖ సమయంలో ప్రణయ్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు లోకేశ్ పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించి ఇండియా టుడేలో ప్రచురితమైన కథనాన్ని తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకుంటూ లోకేశ్ ఈ విధంగా స్పందించారు. మంత్రి ఆదేశాలతో విద్యాశాఖ అధికారులు ఈ ఘటనపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

## భారత్‌ను ముంచెత్తిన చక్కెర సంక్షోభం!

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో హోల్ సేల్ మార్కెట్‌లో ధర రూ. 65 దాటగా, రిటైల్ మార్కెట్లో రూ. 70 మార్కును కూడా అధిగమించింది. అయితే, ఈ ధరల పెరుగుదలకు ఇథనాల్ ఉత్పత్తికి ఎటువంటి సంబంధం లేదని కేంద్రం వెల్లడించింది. ఇథనాల్ తయారీ కోసం చక్కెర మళ్లింపు గతంతో పోలిస్తే తగ్గిందని గణాంకాలతో సహా వివరించింది. 2022-23లో 12 శాతం చక్కెరను ఇథనాల్ కోసం మళ్లించగా, 2025-26 నాటికి అది 9 శాతానికే పరిమితమైందని తెలిపింది. దేశంలో ఉత్పత్తి అవుతున్న ఇథనాల్‌లో దాదాపు మూడో వంతు మొక్కజొన్న వంటి ధాన్యాల నుంచే వస్తోందని స్పష్టం చేసింది. ధరలను అదుపు చేసేందుకు ఇప్పటికే తగిన చర్యలు ప్రారంభించామని, చక్కెర నిల్వలపై పరిమితులు విధించామని ప్రభుత్వం పేర్కొంది. అంతేకాకుండా, దేశీయ సరఫరాను పెంచేందుకు సుంకాలు లేని లేదా అతి తక్కువ సుంకంతో కూడిన దిగుమతులకు అనుమతులు మంజూరు చేసినట్లు వెల్లడించింది.

## ఆయుర్వేద చికిత్స కోసం రేపు కేరళ వెళుతున్న పవన్ కల్యాణ్

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ రేపు కేరళకు పయనం కానున్నారు. తన భుజం నొప్పికి ఆయుర్వేద చికిత్స తీసుకునే నిమిత్తం ఆయన శనివారం కేరళకు వెళ్లనున్నట్లు జనసేన పార్టీ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇటీవల పవన్ కల్యాణ్ తన కుడి భుజం 'రొటేటర్ కఫ్' గాయానికి ముంబైలో శస్త్రచికిత్స చేయించుకున్న సంగతి తెలిసిందే. శస్త్రచికిత్స అనంతరం కొంతకాలం పాటు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని, అధికారిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని వైద్యులు ఆయనకు సూచించారు. అయితే, పరిపాలనా బాధ్యతల దృష్ట్యా పవన్ కల్యాణ్ శస్త్రచికిత్స జరిగిన వారంలోపే తిరిగి విధుల్లో చేరారు. ముందస్తుగా నిర్ణయించిన ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు, శాఖాపరమైన సమీక్షలు, పార్టీ అంతర్గత సమావేశాలను ఆయన నిర్వహించారు.

## పోలీస్ స్టేషన్ ముందు రాహుల్ గాంధీ ధర్నా..

(మొదటి పేజీ తరువాయి)

స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అనంతరం సీనియర్ పోలీస్ అధికారి కార్యాలయం బయట బాధితుడితో కలిసి ధర్నాకు కూర్చున్నారు. జులై 20న పరీక్షల పేపర్ లీక్‌లకు నిరసనగా వందలాది మంది విద్యార్థులు పార్లమెంట్ వైపు మార్చ్ చేపట్టిన విషయం తెలిసిందే. ఆ సమయంలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. 'ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్' (ఆర్ఏఎఫ్) సిబ్బంది పెల్లెట్ గన్స్ ఉపయోగించారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఈ ఘటనలో గాయపడినట్లు పలువురు నిరసనకారులు చెప్పడంతో పాటు వైద్య నివేదికలు కూడా ఉన్నాయని కాంగ్రెస్ పేర్కొంది. అయితే జులై 20న పెల్లెట్ గన్స్ ఉపయోగించలేదని ఢిల్లీ పోలీసులు పలుసార్లు తెలిపారు. ఈ అంశంపై సీఆర్‌పీఎఫ్ మాత్రం ఇప్పటివరకు స్పందించలేదు. మరోవైపు, గాయపడిన నిరసనకారుల వాంగ్మూలాలు, వైద్య నివేదికలు పెల్లెట్ గన్స్ వాడలేదన్న వాదనపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని కాంగ్రెస్ పేర్కొంది.

# ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసు.. సాదిక్ ఖాన్ దొరికాడు!

(మొదటి పేజీ తరువాయి)

కొన్ని రోజులుగా పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్న అతడిని ఎట్టకేలకు పట్టుకున్నారు. అయితే ఈ విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచుతున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం సాదిక్ ఖాన్‌ను కాకినాడకు తరలిస్తున్నట్టు సమాచారం. పంచాయతీ రాజ్ శాఖలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న టిల్లాపూడి నూకరాజు, ఆయన భార్య, కుమార్తెతో కలిసి ఈ నెల 16న రాజమహేంద్రవరం వద్ద గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆత్మహత్యకు ముందు వారు రాసిన సూసైడ్ నోట్‌లో తమ చావుకు కోచ్ సాదిక్ ఖాన్ వేధింపులే కారణమని స్పష్టంగా పేర్కొన్నారు. తన కుమార్తె సౌజన్యను లోబరుచుకునేందుకు ప్రయత్నించాడని, ముస్లిం మతంలోకి మారాలని ఒత్తిడి చేశాడని, తమ కుటుంబంపై తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేశాడని నూకరాజు ఆ లేఖలో ఆరోపించారు. ఈ ఘటన తర్వాత పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా, నూకరాజు, ఆయన కుమార్తె సౌజన్య మృతదేహాలు లభ్యమయ్యాయి. ఆయన భార్య మీనా మృతదేహం కోసం గాలింపు ఇంకా కొనసాగుతోంది. మనవడు ఎలాగోలా ఈదుకుంటూ బయటపడ్డాడు.

**ఐదు బృందాలతో గాలింపు..**

నూకరాజు కుటుంబం ఆత్మహత్య చేసుకున్న నాటి నుంచి సాదిక్ ఖాన్ పరారీలో ఉన్నాడు. అతడిని పట్టుకునేందుకు కాకినాడ జిల్లా పోలీసులు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఢిల్లీ, ముంబై నగరాల్లో విస్తృతంగా గాలింపు చేపట్టారు.



పోలీసులను తప్పించుకునేందుకు సాదిక్ ఖాన్ తన సెల్ ఫోన్‌ను ఉపయోగించకుండా, వేర్వేరు ప్రాంతాలకు మారుతూ జాగ్రత్తలు తీసుకున్నాడు. అయినప్పటికీ, సాంకేతిక ఆధారాలతో అతడి కదలికలను గుర్తించిన పోలీసులు ఢిల్లీలో అదుపులోకి తీసుకున్నారు. ఏఈ నూకరాజు మనవడు, కాకినాడలో సాదిక్ ఖాన్ నడుపుతున్న షూటింగ్ అకాడమీలో చేరాడు. దీన్ని అదనుగా చేసుకున్న సాదిక్, నూకరాజు కుటుంబంతో పరిచయం పెంచుకున్నాడు. ముఖ్యంగా, నూకరాజు కుమార్తె సౌజన్యకు మాటలతో వల వేసి, ఆమెను పూర్తిగా తన ఆధీనంలోకి తెచ్చుకున్నాడు. క్రమంగా ఆ ఇంటిపై పట్టు సాధించి, ఇంట్లో ఉన్న బంగారం, నగదు, ఏటీఎం కార్డులను కూడా తన నియంత్రణలోకి తీసుకున్నాడు. సాదిక్ ఖాన్ పెట్టిన తీవ్ర మానసిక హింసను తట్టుకోలేక నూకరాజు కుటుంబం గోదావరి నదిలో దూకింది. అయితే, సౌజన్య భర్త జగదీశ్వర్ రెడ్డి జూలై 2న మరణించడంతో ఈ వ్యవహారం మరో మలుపు తిరిగింది. జగదీశ్వర్ రెడ్డి మృతిపై అతని తండ్రి భాస్కర్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న సౌజన్య రాసిన లేఖలో పలు సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. తన భర్త జగదీశ్వర్ రెడ్డికి సాదిక్ ఖాన్ విషపూరిత పదార్థం ఇచ్చి చంపాడని ఆమె ఆరోపించింది. తన ప్రైవేట్ ఫొటోలను అడ్డం పెట్టుకుని బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని, ఆస్తుల కోసం తనతో పాటు తన తండ్రి నూకరాజును కూడా చంపేస్తానని బెదిరించాడని లేఖలో పేర్కొంది. అంతేకాకుండా, ఇస్లాం మతంలోకి మారాలని తనపై ఒత్తిడి తెచ్చాడని కూడా ఆమె ఆరోపించింది. భాస్కర్ రెడ్డి ఫిర్యాదు మేరకు సర్పవరం పోలీసులు సాదిక్ ఖాన్‌పై హత్యాప్రయత్నంతో పాటు మరో ఐదు నేరాల కింద కేసు నమోదు చేశారు. కేసు నమోదైన విషయం తెలియగానే సాదిక్ తన మొబైల్ ఫోన్‌ను వదిలేసి పరారయ్యాడు. ఇతరుల ఫోన్ల నుంచి కాల్స్ చేస్తూ రైలులో పారిపోయి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. కాకినాడ జిల్లాకు చెందిన మూడు, తూర్పుగోదావరికి చెందిన రెండు పోలీసు బృందాలు అతని కోసం ముమ్మరంగా గాలిస్తున్నాయి.

## అంతరిక్ష స్టార్టప్‌లకు అండదండలు



న్యూఢిల్లీ: స్పేస్ స్టార్టప్‌లకు ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. ఆయా స్టార్టప్‌లను నిర్వహించే యువ పారిశ్రామికవేత్తలను మరింత ప్రోత్సహిస్తామని ప్రకటించారు. వ్యవసాయం, పశుసంపద, పాడి, పర్యావ రణం, ప్రజల దైనందిన జీవితాలను ప్రభా వితం చేసే రంగాల్లో అంతరిక్ష సాంకేతికతను ఎలా ఉపయోగించాలన్న దానిపై అన్వేషణ సాగించాలని వారిని కోరారు. 20 స్పేస్ స్టార్టప్‌ల వ్యవస్థాపకులు, సీఈఓలతో ప్రధాని మోదీ శుక్రవారం సమావేశమ య్యారు. అంతరిక్ష స్టార్టప్‌ల వంటి నూతన, సవాలుతో కూడిన రంగంలోకి ప్రవేశించి, రిస్కులు తీసుకుని, ప్రభుత్వ సంస్కరణల ప్రక్రియను విశ్వసించి, ప్రయత్నాలను నిలకడగా కొనసాగిస్తున్నందుకు వారిని ప్రశంసించారు. ఈ రంగంలో విజయాలు సాధించడానికి అన్ని విధాలుగా మద్దతు ఇస్తామని పేర్కొన్నారు. అలాగే, అంతరిక్ష సాంకేతికతల వినియోగాన్ని విస్తరించేందుకు అంతరిక్ష రంగ సంస్థలు, ఇతర రంగాల్లోని సంస్థల మధ్య మరింత సహకారం ఉండాలని అభిప్రా యపడ్డారు. అంతరిక్ష రంగంలో ప్రపంచానికి ఒక బలమైన, వినూత్నమైన, వాణిజ్యపరంగా ఆచరణీయమైన నమూనాను భారత్ అందించగలదని మోదీ స్పష్టంచేశారు. అంతరిక్షం నుంచి వచ్చే శిథిలాలపై పరిశో ధిస్తున్న కంపెనీలు తమ సాంకేతికతలను విస్తరించడానికి పర్యావరణ సంస్థలతో కలిసి పనిచేయవచ్చని ప్రధానమంత్రి సూచించారు. వ్యవసాయ రంగంతో కలిసి పని చేస్తున్న స్పేస్ టెక్నాలజీ కంపెనీలు వ్యవ సాయ విశ్వవిద్యాలయాలు, విభాగాలతో సమన్వయం చేసుకోవచ్చని అన్నారు. తద్వారా రైతులు మరింత సమాచారంతో కూడిన నిర్ణయాలు తీసుకోవడానికి , వారి ఉత్పత్తిని గరిష్ఠ స్థాయికి పెంచుకోవడానికి వీలవుతుందని వెల్లడించారు. స్టార్టప్‌లు తమ కార్యకలాపాలపై అర్థవంతమైన ప్రజెంటేషన్లు ఇచ్చాయని, అలాగే ప్రభుత్వం చేపట్టిన అంతరిక్ష రంగ సంస్కరణలను, ఆ రంగం వృద్ధికి కల్పించిన అవకాశాలను అవి ప్రశంసించాయని ప్రధానమంత్రి పేర్కొ న్నారు. యువ పారిశ్రామికవేత్తల కృషి వల్ల అంతరిక్ష రంగంలో భారత్ ఎన్నో ఘనతలు సాధించిందని హర్షం వ్యక్తంచేశారు.

## రికార్డు ధర పలికిన ఎకరం




రాయదుర్గంలో ఇప్పటి వరకు ఎకరా భూమికి రూ.237 కోట్లుగా ఉన్న గత రికార్డును చెరిపేసింది. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ రియల్‌ఎస్టేట్ సంస్థ ఎంఎస్ఎన్ రియల్టీ హైయెస్ట్ బిడ్డర్‌గా నిలిచి ఈ ప్లాట్‌ను చేజిక్కించుకుంది. శుక్రవారం జరిగిన ఈ--వేలంలో నాలెడ్జ్ సిటీ సర్వే నంబర్ 83/1లో 5.25 ఎకరాల ప్లాట్--1ను కంపెనీ రూ.1,386 కోట్లకు దక్కించుకుంది. ఎంఎస్ఎన్ రియల్టీ ఎంట్రీతోనే హైదరాబాద్ భూముల వేలం సరికొత్త మలుపు తిరిగింది. రాయదుర్గంలో 2025 అక్టోబర్‌లో ఎకరా రూ.177 కోట్ల చొప్పున ఈ కంపెనీ మొత్తం 7.67 ఎకరాలను చేజిక్కించుకొని రియల్టీ రంగాన్ని ఔరా అనిపించింది. ఇప్పుడు ఇదే కంపెనీ అంతకు మించిన ధర వెచ్చించింది. రిజర్వ్‌ప్రైస్‌తో పోలిస్తే 51 శాతం ప్రీమియంతో ప్లాట్ అమ్ముడైందని తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) వైస్ చైర్మన్, ఎండీ కె.శశాంక తెలిపారు. హైదరాబాద్ ఐటీ కారిడార్‌లోని రాయదుర్గం భూములకు ఈ ఏడాది మే 28న జరిగిన వేలంలో ఎకరా రూ.237 కోట్లు పలికిన విషయం తెలిసిందే. ఇదే జోష్‌తో ఐటీసీ కోహినూర్‌కు ఎదురుగా సర్వే నంబర్ 83/1లో రెండు ప్లాట్లకుగాను మొత్తం 10.63 ఎకరాలను టీజీఐఐసీ విక్రయానికి ఉంచింది. ఎకరం కనీస ధర గతంలో రూ.139 కోట్లు ఉంటే.. ఈసారి రూ.175 కోట్లుగా టీజీఐఐసీ నిర్ణయించింది. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీ) ఏర్పాటు చేసేందుకు దిగ్గజాలు హైదరాబాద్‌కు వరుస కట్టడంతో గ్రేడ్--ఏ స్పేస్ డిమాండ్ పెరిగింది. దీంతో రాయదుర్గం ప్రాంతంలోని స్థలం హాట్‌కేకుల్లా అమ్ముడవుతోంది. ఈ నెల 14న జరిగిన ప్రీ--బిడ్ సమావేశంలో ప్రముఖ కంపెనీలు పాల్గొన్నాయి. ఇక్కడి స్థలం కోసం కంపెనీలు పోటీ పడడంతో గత రికార్డులు తిరగరాస్తూ ఎకరా రూ.250 కోట్లు దాటే అవకాశం ఉందని ఆగస్ట్ 15న సాక్షి ప్రత్యేక కథనం ప్రచురించింది. ఇక ఈ నెల 28న 5.38 ఎకరాల విస్తీర్ణం ఉన్న ప్లాట్--2కు వేలం జరగనుంది. తాజా డీల్‌తో వేలంలో ఎకరా రూ.275--300 కోట్ల మధ్య పలికే అవకాశముందని ప్రభుత్వం భావిస్తోంది.

# సీఎం టూర్‌కు కేంద్రం నో

(మొదటి పేజీ తరువాయి)

అందుకే సీఎం పర్యటనకు అనుమతి ఇవ్వలేదు. అయితే సీఎం యూకే పర్యటనకు మాత్రం అనుమతి ఇచ్చాం'అని విదేశాంగ శాఖ ప్రతినిధి రణ్ధీర్ జైశ్వాల్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. గతంలో ఢిల్లీ సీఎంగా పనిచేసిన అరవింద్ కేజ్రీవాల్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా పనిచేసిన మమతా బెనర్జీ విదేశీ పర్యటనలకు సైతం విదేశాంగ శాఖ రాజకీయ అనుమతులు నిరాకరించడం గమనార్హం. కేంద్రం రాజకీయ అనుమతుల నిరాకరణ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనను రద్దు చేసుకున్నారు. అయితే తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందాన్ని అమెరికా వెళ్లాలని.. ఇది వరకే అక్కడి సంస్థలతో సంప్రదింపులు జరిపినందున హార్వర్డ్ విశ్వవిద్యాలయం, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ), నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీ, వర్జీనియా టెక్ వంటి సంస్థలతో అవగాహన ఒప్పందాలు (ఎంఓయూ) కుదుర్చుకోవాలని సీఎం ఆదేశించారు. ఆయన మాత్రం ఈ నెల 23న హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు. కాగా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనలో భాగంగా ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ (ఐఓసీ) ఏర్పాటు చేయనున్న ముఖాముఖి కార్యక్రమాన్ని షెడ్యూల్‌లో చేర్చడం వల్లే ఆయన పర్యటనకు కేంద్రం అనుమతించలేదని సమాచారం. తెలంగాణ అభివృద్ధి, విద్యారంగ పురోగతికి, వికసిత్ భారత్ నిర్మాణానికి తోడ్పడే తన అమెరికా పర్యటనకు రాజకీయ కారణాలతో కేంద్రం అనుమతి నిరాకరించడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర విస్మయం వ్యక్తం చేశారు. అయినప్పటికీ కేంద్రం నిర్ణయాన్ని గౌరవిస్తూ లండన్ నుంచి హైదరాబాద్‌కు తిరిగి రావాలని నిర్ణయించుకున్నారు. 'ఈ పర్యటన ఉద్దేశం ఒక్కటే. కేంద్రం తీసుకొచ్చిన నూతన విద్యా విధానంలో భాగంగా ప్రపంచంలోని ప్రఖ్యాత విద్యాసంస్థలను భారత్‌కు, తెలంగాణకు, హైదరాబాద్‌కు తీసుకురావడం. అత్యుత్తమ ఐవీ లీగ్ విశ్వవిద్యాలయాలను, ప్రపంచంలోని అగ్రశ్రేణి విద్యాసంస్థల నుంచి విద్య, నైపుణ్యాలు, శిక్షణ పొందాలన్న మన యువత ఆకాంక్షలకు ఇవి సమాధానంగా నిలిచేవి. దేశ నిర్మాణం, యువత భవిష్యత్తు విషయంలో అందరూ రాజకీయాలు, ఎన్నికలకు అతీతంగా ఆలోచించాలని నేను ఎప్పుడూ విశ్వసిస్తాను'అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

**ప్రపంచ అగ్రశ్రేణి నగరాల్లో ఒకటిగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతా..**

'హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దుతాం. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి హెచ్‌సీయూ, జేఎన్‌టీయూ తదితర విశ్వవిద్యాలయాల ఏర్పాటు హైదరాబాద్‌ను అత్యుత్తమ మానవ వనరుల కేంద్రంగా మార్చింది. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్... ప్రపంచానికి నాయకత్వం వహించగలమని నిరూపించింది. అక్కడి నుంచి ప్రపంచంలోని గొప్ప టెక్ నాయకుల్లో కొందరు రూపుదిద్దుకున్నారు. ఐఐటీ, ఐఎస్‌బీ, ఐఐఐటీ, నల్సార్ వంటి సంస్థల ఏర్పాటుతో హైదరాబాద్ అగ్రశ్రేణి సంస్థలు, వాటి గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లను ఆకర్షించగలిగింది. ఇప్పుడు ప్రపంచంలోని ప్రఖ్యాత విద్య, నైపుణ్య సంస్థలకు హైదరాబాద్‌ను కేంద్రంగా మార్చి 21వ శతాబ్దపు మన ప్రగతి ప్రయాణానికి శక్తినిస్తాం. హైదరాబాద్‌ను ప్రపంచంలోని అగ్రశ్రేణి నగరాల్లో ఒకటిగా తీర్చిదిద్దాలన్నది నా సంకల్పం, ప్రయత్నం. ఒక సాధారణ భారతీయుడు హైదరాబాద్‌లోనే హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్ లేదా ఎంఐటీ, ఎల్‌బీఎస్, ఎల్ఎస్ఈ వంటి ప్రపంచస్థాయి సంస్థల నుంచి విద్య, సర్టిఫికేషన్ పొందగలగాలి. ఎందుకంటే చాలా మంది నాయకులు తమ పిల్లలను విదేశాలకు పంపాలని కోరుకున్నారు. కానీ నేను ప్రపంచంలోని అత్యుత్తమ విద్యాసంస్థలను భారత్‌కు తీసుకురావాలని అభిలషిస్తున్నాను'అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా వివరించారు.



# భక్తి ప్రపత్తులతో వరలక్ష్మీ వ్రతాలు

- ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్న చిన్నగూడూరు మండలం

**తొలివెలుగు, చిన్నగూడూరు:** చిన్నగూడూరు మండల వ్యాప్తంగా శ్రావణ శుక్రవారం నాడు ముత్తైదువులు వరలక్ష్మీ వ్రతాలను అత్యంత భక్తిశ్రద్ధలతో ఆచరించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉదయం నుంచే ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. మహిళలు ఇళ్లలోనూ, ఆలయాల్లోనూ వరలక్ష్మీ దేవిని సర్వాంగ సుందరంగా అలంకరించి షోడశోపచార పూజలు నిర్వహించారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, పూలు, కొబ్బరికాయలు, నానబెట్టిన శనగలు, నానా విధ ఫలాలను నైవేద్యంగా సమర్పించారు. హిందూ సంప్రదాయంలో విశిష్ట స్థానం ఉన్న ఈ వ్రతాన్ని ఆచరించడం వల్ల అష్టైశ్వర్యాలు ప్రాప్తిస్తాయని, కుటుంబం ఆయురారోగ్యాలతో వర్ధిల్లుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ పూజా కార్యక్రమాల్లో మహిళలు, చిన్నారులు అధిక సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# భారీగా రేషన్ బియ్యం సీజ్

- వ్యక్తిపై కేసు నమోదు చేసిన హయత్‌నగర్ పోలీసులు



**తొలివెలుగు, హయత్‌నగర్:** అక్రమంగా నిల్వ ఉంచిన 20 క్వింటాళ్ల రేషన్ (పీడీఎస్) బియ్యాన్ని హయత్‌నగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండలం అంగోతు తండాకు చెందిన అంగోతు లక్ష్మణ్ (52) ప్రస్తుతం హయత్‌నగర్‌లోని సూర్యనగర్ కాలనీలో నివాసముంటున్నాడు. గురువారం ఉదయం సూర్యనగర్ కాలనీలోని అతని గదిపై దాడులు నిర్వహించిన పోలీసులు.. అక్రమంగా నిల్వ ఉంచిన 42 బస్తాల (సుమారు 20 క్వింటాళ్లు) పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, అంగోతు లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## కోర్టులో మౌలిక సదుపాయాలు కల్పించాలి

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి బార్ అసోసియేషన్ వినతి
- కోర్టు ప్రాంగణాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే



**తొలివెలుగు, హయత్‌నగర్:** హయత్‌నగర్ కోర్టు ప్రాంగణంలో మౌలిక వసతులను మెరుగుపరిచి, న్యాయవాదులు, కక్షిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని కోరారు. బార్ అసోసియేషన్ నాయకుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కోర్టు ప్రాంగణాన్ని శుక్రవారం న్యాయవాదులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. కోర్టులో దాదాపు 200 మంది న్యాయవాదులు విధులు నిర్వహిస్తున్నారని, రోజూ వందలాది మంది కక్షిదారులు వస్తుంటారని వివరించారు. ప్రాంగణంలో పార్కింగ్, రహదారులు, డ్రైనేజీ, తాగునీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి.. సంబంధిత అధికారులతో మాట్లాడి సాధ్యమైనంత త్వరగా అవసరమైన అభివృద్ధి పనులు చేపడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు చెన్నగోని శ్రీధర్‌గౌడ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పల్లె లింగంగౌడ్, భాస్కర్ సాగర్, బోడ భిక్షపతి తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

## మాజీ వాటర్‌మ్యాన్‌కు కేఆర్ఆర్ ఫౌండేషన్ ఆసరా

- రూ.5 వేల సాయం అందించిన కంచర్ల రామచంద్రారెడ్డి



**తొలివెలుగు, రాజపేట:** మండల పరిధిలోని చల్లూరు గ్రామంలో 25 ఏళ్ల పాటు వాటర్‌మ్యాన్‌గా సేవలుందించి ప్రస్తుతం అనారోగ్యంతో బాధపడుతున్న కూతురు యాదగిరికి కేఆర్ఆర్ ఫౌండేషన్ తరఫున రూ.5,000 ఆర్థిక సాయం అందించారు. శుక్రవారం ఫౌండేషన్ ఛైర్మన్ కంచర్ల రామచంద్రారెడ్డి బాధితుడికి ఈ నగదు సాయాన్ని అందజేసి, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. స్వగ్రామంపై ఉన్న ప్రేమతో, ఆపదలో ఉన్నవారికి తనవంతుగా నిరంతరం చేయూతనందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ బింగి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక శోభతో వెల్లివిరిసిన సామూహిక వరలక్ష్మీ వ్రతం





- భవానినగర్ శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో కన్నులపండువగా పూజలు
- పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, భక్తులు
- దేవాలయ కమిటీ చైర్మన్ బొబ్బిళ్ళ మురళి

**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని భవానినగర్ శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళల సౌభాగ్యం నిండునూరేళ్లు వర్ధిల్లాలని కోరుతూ వేద పండితులు పెద్ది సుధాకర్ శర్మ వేదమంత్రోచ్ఛరణల నడుమ అమ్మవారి వ్రత కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ఈ వేడుకల్లో వందలాది మంది మహిళా భక్తులు ఉత్సాహంగా పాల్గొని సామూహికంగా వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, దేవాలయ కమిటీ చైర్మన్ బొబ్బిళ్ళ మురళి, ధర్మకర్తలు వరకాల రవి గౌడ్, ఆవుల యేసు యాదవ్, గుగులోతు అరుణ శంకర్ నాయక్, దాడి యశ్వంత్ రెడ్డి, ట్రినిటీ విద్యాలయాల డైరెక్టర్ కమ్ ప్రిన్సిపల్ ఉజ్జిని మంజుల, పెద్ది స్వాతి కిషోర్ శర్మ, ఉప్పల కుసుమ, చింతల విజయలక్ష్మి, చింతల కరుణ, ఉప్పల దీపిక, పల్సం శ్రావణి, జక్కర్తి స్వాతి, దేవరపల్లి కరుణశ్రీ, దాచేపల్లి లక్ష్మి, దాచేపల్లి రమాదేవి, సింగరికొండ శైలజ, గర్దాసు లక్ష్మి, పారా అనసూయ, మిరియాల లక్ష్మీ ప్రియ, మొగుదాల వెంకటేష్ గౌడ్, బొడ్డు రాజేందర్ రెడ్డి, కాసాని అయిలమ్మ, మునుకుంట్ల జయమ్మ, బడుగు గౌరీశ్వరి, బొబ్బిళ్ళ యశోద, చింతకింది ప్రవళిక, సుర్వి జంగమ్మ, రేగలగడ్డ శిరీష, సుర్వి నికిత, బాలగోని ప్రగతి తదితరులు పాల్గొన్నారు.

# సామాన్యులకు కార్పొరేట్ వైద్యం అందాలి





- సేవా దృక్పథంతో ఆసుపత్రులు పనిచేయాలి
- ఎస్1 హాస్పిటల్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**తొలివెలుగు,ఎల్‌బీనగర్:** పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటు ధరల్లోనే నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రైవేటు ఆసుపత్రులు పనిచేయాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సూచించారు. చింతలకుంట పరిధిలోని జహంగీర్‌నగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన 'ఎస్1 హాస్పిటల్'ను శుక్రవారం ఆయన ఆసుపత్రి చైర్మన్, ఎండీ డాక్టర్ లక్ష్మీప్రసన్నతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎల్‌బీనగర్ ప్రాంతవాసులకు ఎముకలు, చర్మ వ్యాధులు, సాధారణ వైద్యం తదితర విభాగాల్లో నిష్ణాతులైన వైద్యులతో కూడిన కార్పొరేట్ స్థాయి వైద్యం అందుబాటులోకి రావడం హర్షణీయమన్నారు. ఆసుపత్రి ప్రారంభోత్సవం సందర్భంగా నెల రోజుల పాటు ఉచితంగా ఓపీ సేవలు అందించడం యాజమాన్య సేవా దృక్పథానికి నిదర్శనమని ఆయన కొనియాడారు. అనంతరం ఆసుపత్రి ఎండీ డాక్టర్ లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ.. తమ ఆసుపత్రిలో 50 పడకల సామర్థ్యంతో పాటు అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. నెల రోజుల పాటు ఉచిత ఓపీతో పాటు, అన్ని రకాల వైద్య పరీక్షలపై భారీ రాయితీలు అందిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, జిట్టా రాజశేఖర్‌రెడ్డి, జహంగీర్‌నగర్ కాలనీ అధ్యక్షుడు ఎండీ కైసర్, బీజేపీ సీనియర్ నాయకుడు గానవనేని వాసు, చందనా బ్రదర్స్ ఎండీ డాక్టర్ జానా రామారావు, ఎండీ అనస్‌బాయ్, డాక్టర్ సాయిశంకర్, డాక్టర్ విశ్వేశ్వర్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్థానిక నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# మీ సమస్యల పరిష్కారం నా బాధ్యత

- కాలనీల అభివృద్ధికి అండగా ఉంటా.. సంక్షేమ సంఘాలకు మధుయాష్కీ భరోసా
- క్షేత్రస్థాయి నుంచి కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి
- ఎస్సీ డిపార్ట్‌మెంట్ నూతన కమిటీ సభ్యులకు దిశానిర్దేశం

**తొలివెలుగు, ఎల్‌బీనగర్:** కాలనీల అభివృద్ధికి తనవంతు పూర్తి సహకారం అందిస్తానని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ హామీ ఇచ్చారు. నూతనంగా ఎన్నికైన లెక్చరర్స్ కాలనీ, సహారా స్టేట్స్, పద్మావతి కాలనీ, ద్వారకామయినగర్, దత్తాత్రేయనగర్ కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు క్యాంపు కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపి, స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. చింతలకుంట పరిధిలోని గుంటి జంగయ్యనగర్ వాసులు తమ ప్రాంత సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు ప్రతినిధులు బోనాలు, ఫలహారం బండి ఉత్సవాలతో పాటు పలు శుభకార్యాలకు ఆయనను ఆహ్వానించారు. నూతన భవన నిర్మాణానికి సహకరించాలని నాయిబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

**ప్రజా సమస్యల పరిష్కారానికి చురుగ్గా పనిచేయాలి:**

ఎల్‌బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం నూతన చైర్మన్‌గా నియమితులైన ఉరిపక్క రవికుమార్, జిల్లా వైస్ చైర్మన్ పోగుల నరసింహ, ప్రధాన కార్యదర్శి జెనిగె నరేష్ తదితరులు మధుయాష్కీగౌడ్‌ను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ప్రతినిధులను అభినందించిన ఆయన.. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని దిశానిర్దేశం చేశారు. పార్టీ కార్యక్రమాలను అట్టడుగు వర్గాలకు చేరువ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ల చైర్మన్లు బాలకృష్ణ, కొమ్ము నాగరాజు, వరిగంటి సురేష్, భవానీ, సరస్వతి, కే. పెద్దులు తదితరులు పాల్గొన్నారు.



# అమ్మవారి దివ్య ఆశీస్సులతో అందరికీ శుభాలు కలగాలి


- వరలక్ష్మీ వ్రత పూజలో బద్దం సృజన ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి

**తొలివెలుగు, ఎల్‌బీనగర్:** వరలక్ష్మీదేవి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని బీజేపీ నాయకురాలు బద్దం సృజన ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి ఆకాంక్షించారు. శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని బీజేపీ రంగారెడ్డి (అర్బన్) జిల్లా ఉపాధ్యక్షురాలు నందికొండ గీతారెడ్డి నివాసంలో నిర్వహించిన వరలక్ష్మీ వ్రత పూజా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం పూజలో పాల్గొన్న మహిళలకు శ్రావణ శుక్రవారం శుభాకాంక్షలు తెలిపారు. శ్రావణ మాసంలో వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించడం మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు, భక్తులు పాల్గొన్నారు.



# ఆర్థిక ఒత్తిడి తాళలేక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అఘాయిత్యం

- హస్తినాపురంలో విషాదం
- ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని బలవన్మరణం



**తొలివెలుగు, వనస్థలిపురం:** ఆర్థిక లావాదేవీల్లో తలెత్తిన చిక్కులతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన హస్తినాపురంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హస్తినాపురానికి చెందిన చలిచీమల కిశోర్‌బాబు (38) సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆర్థిక సంబంధిత వ్యవహారాల్లో తీవ్ర ఒత్తిడికి లోనైన కిశోర్‌బాబు, ఈ నెల 20న మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నారు. సాయంత్రం 5 గంటలకు బయట నుంచి ఇంటికి వచ్చిన భార్య గమనించి వెంటనే ఆసుపత్రికి తరలించగా, పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

# ధర్మారెడ్డిపల్లి కాలువను పూర్తి చేయాలి

- గుంతలమయమైన ఆర్‌ఎంబీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి
- కొమ్మాయిగూడెంలో సీపీఎం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు



**తొలివెలుగు, రామన్నపేట:** ప్రాజెక్టు ప్రారంభమై 23 ఏళ్లు గడుస్తున్నా పూర్తవని ధర్మారెడ్డిపల్లి కాలువ పనులను వెంటనే పూర్తి చేయాలని సీపీఎం సీనియర్ నాయకులు మేక అశోక్‌రెడ్డి, జల్లెల పెంటయ్య డిమాండ్ చేశారు. కొమ్మాయిగూడెం సీపీఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన రిలే నిరాహార దీక్షలను ఉద్దేశించి వారు మాట్లాడారు. కాలువ నిర్మాణంతో ఈ ప్రాంత రైతులకు సాగునీరు అందుతుందని, ప్రభుత్వం బడ్జెట్ కేటాయించి పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లించాలని కోరారు. రామన్నపేట - కొమ్మాయిగూడెం మీదుగా పెద్దకాపర్తి వరకు ఉన్న ఆర్‌ఎంబీ రహదారి గుంతలమయమై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన పేదలందరికీ వెంటనే పింఛన్లు మంజూరు చేయాలని, కొమ్మాయిగూడెం నుంచి వెలిమినేడు, సిరిపురం గ్రామాలకు బీటీ రోడ్డు నిర్మించడంతో పాటు మంచినీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు వనం ఉపేందర్, మండల నాయకులు కూరెళ్ల నరసింహచారి, కందుల హనుమంతు, కల్లూరు నాగేష్, బావండ్లపల్లి బాలరాజు, ఆవనగంటి నాగేష్, మేడి ముకుందం, మునుకుంట్ల లెనిన్, పల్లె సత్యం, శానగొండ వెంకటేశ్వర్లు, ఎర్ర రవీందర్, ఎర్ర కాటమయ్య, అంతటి సత్తయ్య, అంతటి నరసింహ, శానగొండ రాము, సాగర్ల శేఖర్, గుణగంటి మల్లేష్, జల్లెల మల్లేశం, ఆకిటి మల్లేశం, ఆకిటి శ్రీను, కడప చరణ్, బాణాల నవీన్‌రెడ్డి, గోలి ఉత్తేజ్, కొండగడప నవీన్, జల్లెల శివకుమార్, బోయపల్లి శంకర్, పొట్లచెరువు శంకరయ్య, మాజీ సర్పంచ్ జల్లెల లక్ష్మమ్మ, ఎర్ర సుమలత, ఎర్ర అలివేలు, బాత్క ఐలమ్మ, బాత్క మారయ్య తదితరులు పాల్గొన్నారు.

# గురువుకే రక్షణేదీ?

- ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల ఆవేదన
- రామన్నపేటలో నల్లబ్యాడ్జీలతో నిరసన ర్యాలీ, బంద్

**తొలివెలుగు, రామన్నపేట:** నల్లగొండ జిల్లా, కొండమల్లేపల్లి నాగార్జున స్కూల్ ప్రిన్సిపాల్ రూపారెడ్డి దారుణ హత్య విద్యా రంగాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని, ఇది విద్యా వ్యవస్థకే మాయని మచ్చ అని రామన్నపేట మండల ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు మండిపడ్డాయి. ఈ దారుణ ఘటనకు నిరసనగా శుక్రవారం మండల వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల బంద్ పాటించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం నుంచి సుభాష్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం సుభాష్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన రూపారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా పలువురు కరస్పాండెంట్లు మాట్లాడుతూ.. నేటి సమాజంలో ఉపాధ్యాయులకు రక్షణ కరువవడం ఆందోళనకరమని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల భద్రతకు తగిన చర్యలు తీసుకోకపోతే విద్యా వ్యవస్థ మనుగడకే ప్రమాదమని హెచ్చరించారు. ప్రభుత్వం స్పందించి నిందితులను కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు టి. మల్లికార్జున్, జె. మార్టిన్, జి. నరేందర్‌రెడ్డి, కనకచారి, నాగరాజు, శ్రీధర్‌తో పాటు ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# యాదాద్రిలో నేత్రపర్వంగా ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు





- భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసిన దేవస్థానం
- వ్రతాల్లో పాల్గొన్న 200 మంది మహిళా భక్తులు
- ఉచితంగా పూజా సామగ్రి అందజేత

**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని మహిళా భక్తుల కోసం దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. వ్రతంలో పాల్గొనే భక్తుల నుంచి ఎలాంటి రుసుము వసూలు చేయకుండా.. పూజకు అవసరమైన పూజా సామగ్రి, పాత్రసామగ్రిని దేవస్థానం ఉచితంగా అందజేసింది. దేవస్థానం కల్పించిన సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ సుమారు 200 మంది మహిళా భక్తులు సామూహికంగా వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించి అమ్మవారిని పూజించారు. తమ కుటుంబాల్లో సుఖసంతోషాలు, సౌభాగ్యం, ఆయురారోగ్యాలు కలగాలని అమ్మవారిని వేడుకున్నారు. వ్రత కార్యక్రమం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో కార్యక్రమం సందడిగా సాగింది. భక్తుల సౌకర్యార్థం ఉచితంగా పూజా సామగ్రిని అందజేసి, సామూహిక వ్రతాన్ని నిర్వహించిన దేవస్థానం అధికారుల చొరవపై భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

# ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తానని మహిళపై అత్యాచారం

- కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు మాలి శంకర్ రెడ్డిపై కేసు నమోదు
- ఆత్మకూర్ (ఎం) పోలీస్ స్టేషన్‌లో బాధితురాలి ఫిర్యాదు

**తొలివెలుగు, ఆత్మకూర్ (ఎం):** ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తానని ఆశచూపి ఓ మహిళపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడిన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్ (ఎం) మండల పరిధిలోని పుల్లాయిగూడెంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. పుల్లాయిగూడెం గ్రామానికి చెందిన మహిళకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తానని, జాబితాలో పేరు వచ్చిందని నమ్మించిన కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు మాలి శంకర్ రెడ్డి, అనంతరం సిమెంట్ బస్తాలు ఇప్పిస్తాననే నెపంతో ఆమెపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని బయటకు చెప్పవద్దని, పోలీసులకు ఫిర్యాదు చేయవద్దంటూ పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టి అర ఎకరం భూమి ఇస్తానని నమ్మబలికాడు. అంతేకాకుండా బాధితురాలితో పాటు ఆమె భర్తను పలుమార్లు భయభ్రాంతులకు గురిచేశాడు. వేధింపులు ఎక్కువ కావడంతో శుక్రవారం బాధితురాలు భర్తతో కలిసి




అఘాయిత్యానికి పాల్పడ్డ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మాలి శంకర్ రెడ్డి

ఆత్మకూర్ (ఎం) పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. అధికార బలంతో మహిళలను మోసగించడం దారుణమని మహిళా సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కల్లూరి సమక్షంలో బీఆర్ఎస్‌లోకి చేరికలు

- పార్టీలో చేరిన కాంగ్రెస్ సీనియర్ నేత మాపు భాస్కర్

తొలివెలుగు, రాజాపేట: రాజాపేట మండల పరిధిలోని బొందుగుల గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మాపు భాస్కర్ శుక్రవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కల్లూరి రామచంద్రారెడ్డి సమక్షంలో ఆయన పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా మాపు భాస్కర్‌కు కల్లూరి రామచంద్రారెడ్డి శాలువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం పార్టీలో ఆయన సేవలను వినియోగించుకుని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బొందుగుల సర్పంచ్ పయ్యావుల ఎల్లయ్య, ఉపసర్పంచ్ ఎండీ అబీద్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేష్, జలసాధన సమితి కన్వీనర్ ఎర్రగోకుల జశ్వంత్, మాజీ ఎంపీపీ గోపగాని బాలమణి యాదగిరిగౌడ్, గ్రామ శాఖ అధ్యక్షులు, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# సాగునీరందక పంటలు ఎండిపోయాయ్

- కాంగ్రెస్ సర్కార్‌పై మండిపడ్డ బీఆర్ఎస్ నేత కల్లూరు రాంచంద్రారెడ్డి
- బొందుగులలో చెరువు, పంట పొలాల పరిశీలన



**తొలివెలుగు, రాజాపేట:** కాంగ్రెస్ పాలనలో సాగునీరు అందక రైతులు అల్లాడుతున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కల్లూరు రాంచంద్రారెడ్డి విమర్శించారు. మండల పరిధిలోని బొందుగుల గ్రామంలో ఎండిపోయిన పంట పొలాలను, చెరువును శుక్రవారం ఆయన నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తపాస్ పల్లి రిజర్వాయర్ నుంచి కాలువల ద్వారా సాగునీరు తీసుకురావడంలో స్థానిక ఎమ్మెల్యే పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడం వల్లే రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేష్, మాజీ ఎంపీపీ బాలమణి యాదగిరి గౌడ్, జల సాధన సమితి అధ్యక్షుడు ఎర్ర గోకుల జశ్వంత్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మద్ర నాగరాజు, సర్పంచ్ పయ్యావుల ఎల్లయ్య, ఉపసర్పంచ్ ఎండీ అబీద్, నాయకులు గుండెగోని శీను, రాంగోపాల్ రెడ్డి, వరిమడ్ల బాలకృష్ణ, స్వామి, నిమ్మల సుదర్శన్, బోయిని రాజు, మాపు భాస్కర్ పాల్గొన్నారు.

# తహశీల్దార్ వీరబాయికి ఘన సన్మానం

- ఉత్తమ అధికారి పురస్కారం అందుకున్న సందర్భంగా అభినందనలు
- పాల్గొన్న ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు

**తొలివెలుగు, చౌటుప్పల్ :** మండల ప్రజలకు మెరుగైన సేవలు అందించి, 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయిలో ఉత్తమ అధికారి పురస్కారం అందుకున్న చౌటుప్పల్ తహశీల్దార్ వీరబాయిని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. సంఘం జిల్లా అధ్యక్షులు బోయ రాములు అధ్యక్షతన ఈ అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్‌ను శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం చౌటుప్పల్ మండల ప్రధాన కార్యదర్శి మంకాల లింగస్వామి, పంతంగి ఉప సర్పంచ్ బోయ సదానందం, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి, సంఘం మండల నాయకురాలు ప్రశాంతి, కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.





## పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలి

- ఇందిరా పార్క్ వద్ద పాదయాత్రను జయప్రదం చేయండి: సీపీఎం

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** జిల్లా వ్యాప్తంగా అసంపూర్తిగా ఉన్న సాగునీటి ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. కనుముక్కల గ్రామంలోని పిల్లాయిపల్లి కాలువను శుక్రవారం పార్టీ శ్రేణులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లాయిపల్లి కాలువపై భీమన్ పల్లి - జిబ్లాక్ పల్లి గ్రామాల మధ్య కల్వర్టుల నిర్మాణం ఏళ్లు గడుస్తున్నా పూర్తి కావడం లేదని మండిపడ్డారు. కాలువకు తగిన బడ్జెట్ కేటాయించి పనులను వేగవంతం చేయాలన్నారు. పోచంపల్లి మండలానికి మూసీ నీటికి బదులుగా పిల్లాయిపల్లి కాలువ ద్వారా గోదావరి జలాలను అందించాలని కోరారు. పెండింగ్ ప్రాజెక్టుల సాధనకై ఈ నెల 29, 30, 31 తేదీల్లో హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద చేపట్టిన పాదయాత్ర, ధర్నా కార్యక్రమాల్లో రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యుడు మంచాల మధు, మండల కమిటీ సభ్యులు నెలకంటి జంగయ్య, బోయపల్లి పుష్పలత, నాయకులు జంగారెడ్డి, పురుషోత్తంరెడ్డి, భూపాల్‌రెడ్డి, కుంభం అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## వానల కోసం... నీటి బిందెల బతుకమ్మ

- నీటి బిందెలతో బతుకమ్మ ఆడిన మహిళలు
- దూది వెంకటాపురంలో వినూత్న పూజలు



**తొలివెలుగు, రాజాపేట:** వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని కోరుతూ మండలంలోని దూది వెంకటాపురం గ్రామంలో మహిళలు శుక్రవారం వినూత్న రీతిలో బతుకమ్మ ఆడారు. చెరువులు, కుంటలు జలకళ సంతరించుకోవాలని, సాగునీటి కొరత తీరాలని ఆకాంక్షిస్తూ నీటి బిందెలను ఉంచి బతుకమ్మ పాటలు పాడుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్రామంలో పాడిపంటలు వృద్ధి చెందాలని వేడుకున్నారు. సంప్రదాయబద్ధంగా నీటి బిందెలతో బతుకమ్మ ఆడిన ఈ వినూత్న కార్యక్రమం స్థానికులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నడిమింటి నరేష్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## భూ రికార్డులు, సర్వే వివరాల పరిశీలన

- క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించిన కలెక్టర్ అనురాగ్ జయంతి
- సమన్వయంతో భూ సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఆదేశం




**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి శుక్రవారం భూ సంబంధిత రికార్డులు, సర్వే వివరాలు, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించారు. గ్రామంలోని వివిధ సర్వే నంబర్లకు సంబంధించిన భూ వివరాలు, హద్దులు, రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులను పరిశీలించి, భూ రికార్డుల్లోని వివరాలతో వాటిని సరిపోల్చారు. భూ సంబంధిత సమస్యలను సమగ్రంగా పరిష్కరించేందుకు అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. రికార్డులు, సర్వే వివరాల పరిశీలనలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు భూ సమస్యల విషయంలో ఇబ్బందులు లేకుండా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించి, నిబంధనల ప్రకారం సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో ఏడీ సర్వే సుజాత, తహసీల్దార్, సంబంధిత అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# ఆలయాల్లో వరలక్ష్మీ శోభ





- భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవార వ్రతాలు
- కన్నులపండువగా సామూహిక కుంకుమార్చనలు, అన్నదానం
- పాల్గొన్న మున్సిపల్ వైస్ చైర్మన్ కొయ్యడ రజని

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని పోచంపల్లి పురపాలక కేంద్రంలో వరలక్ష్మీ వ్రత వేడుకలను భక్తులు వైభవంగా నిర్వహించారు. స్థానిక లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో లక్ష్మీనారాయణ భజన మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన వ్రతాల కార్యక్రమానికి మున్సిపల్ వైస్ చైర్మన్ కొయ్యడ రజని శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మహిళలతో కలిసి సామూహిక వ్రతాలు, కుంకుమార్చనలు నిర్వహించి, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మార్కండేయ స్వామి దేవాలయంలో శంకర మహిళా భక్త మండలి ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు కన్నులపండువగా సాగాయి. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కుంకుమార్చనలు జరిపి, ఒకరికొకరు వాయినాలు సమర్పించుకున్నారు. అనంతరం భక్తులకు మహా అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో లక్ష్మీనారాయణ స్వామి ఆలయ చైర్మన్ అంకం వినోద్ కుమార్, భజన మండలి అధ్యక్షుడు అంకం గోవర్ధన్, ఉపాధ్యక్షుడు జోబు ఉమామహేశ్వర్, ప్రధాన కార్యదర్శి కాపల్లి నారాయణ, సుబ్రహ్మణ్యం, అంకం బాలాజీ, శంకర మహిళా భజన మండలి అధ్యక్షురాలు భువనగిరి వరలక్ష్మి, చిట్టిమల్ల లలిత, దోర్నాల కలమ్మ, వంగ శారద, కందగట్ల భార్గవి తదితరులు పాల్గొన్నారు.



# ఎండిన బోర్లు.. ఆవిరైన ఆశలు





- సాగునీరందక ఎండిపోయిన వరి పంట
- రూ.లక్ష పెట్టుబడి నష్టం.. పశువులకు మేతగా వదిలేసిన రైతు
- ప్రభుత్వం ఆదుకోవాలని రాజాపేట మండలం బొందుగుల రైతు వేడుకోలు

**తొలివెలుగు, రాజాపేట:** వానాకాలం ఆరంభంలో వర్షాలు కురుస్తాయని, పంట చేతికి వస్తుందని ఆశపడ్డ ఆ రైతుకు చివరకు కన్నీళ్లే మిగిలాయి. నమ్ముకున్న బోర్లలో నీరు అడుగంటిపోవడంతో కళ్లముందే ఎకరాటి వరి పైరు ఎండిపోయి బూడిద పాలైంది. రాజాపేట మండలం బొందుగుల గ్రామానికి చెందిన రైతు బాల్ద నరసయ్య తనకున్న మూడు ఎకరాల పొలంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేపట్టాడు. వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ, తన పొలంలో ఉన్న రెండు బోర్ల నీటి ఆధారంగా పంటను కాపాడుకోవచ్చని భావించాడు. ఎరువులు, విత్తనాలు, దుక్కి దున్నడం, కూలీల ఖర్చుల రూపంలో సుమారు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టాడు.

**అడుగంటిన భూగర్భ జలాలు:**

సకాలంలో వర్షాలు కురవకపోవడంతో ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు గణనీయంగా పడిపోయాయి. దీంతో రైతు నరసయ్య పొలంలో ఉన్న రెండు బోర్లు క్రమంగా వట్టిపోయి, నీరు రావడం పూర్తిగా నిలిచిపోయింది. వరి పంట గర్భం దాల్చే కీలక సమయంలో నీరు అందక పచ్చని పైరు కళ్లముందే పసుపు రంగులోకి మారి ఎండిపోయింది.

**పశువులకు మేతగా.**

చేతికొచ్చిన పంట ఎండిపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడిన నరసయ్య.. వేరే దారి లేక ఎండిపోయిన వరి చేనును పశువులకు మేతగా వదిలేశాడు. ఈ సందర్భంగా బాధిత రైతు నరసయ్య కన్నీటిపర్యంతమవుతూ.. "మూడు ఎకరాల్లో వరి సాగు చేశాను. రెండు బోర్లను నమ్ముకుని రూ.లక్ష వరకు అప్పులు చేసి పెట్టుబడి పెట్టాను. వర్షాలు పడితే పంట చేతికి వచ్చి అప్పులు తీరుతాయని ఆశపడ్డాను. కానీ, నీరు లేక బోర్లు ఎండిపోయాయి. పంట పూర్తిగా నాశనమైంది. పెట్టిన పెట్టుబడి మట్టిపాలైంది. ప్రభుత్వం, వ్యవసాయ అధికారులు స్పందించి పంట నష్టాన్ని పరిశీలించి నన్ను ఆదుకోవాలి" అని విజ్ఞప్తి చేశాడు.

## భాజపా ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా పిల్ల బుచ్చయ్య



- ఘనంగా సన్మానించిన మున్సిపల్ అధ్యక్షురాలు కడారి కల్పనా యాదవ్
- పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు:

**తొలివెలుగు, చౌటుప్పల్:** భారతీయ జనతా పార్టీ చౌటుప్పల్ మున్సిపాలిటీ సీనియర్ నాయకులు, లింగోజిగూడెం మాజీ ఉపసర్పంచ్ పిల్ల బుచ్చయ్యను భాజపా ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఈ 3సందర్భంగా చౌటుప్పల్ మున్సిపల్ అధ్యక్షురాలు కడారి కల్పనా ఐలయ్య యాదవ్ ఆయనను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. లింగోజిగూడెం గ్రామానికి, ప్రజలకు ఆయన అందించిన సేవలను గుర్తించి పార్టీ ఈ బాధ్యత అప్పగించిందని కల్పనా యాదవ్ పేర్కొన్నారు. ?ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ మాజీ ఉపాధ్యక్షులు, సీనియర్ నాయకులు రమణగొని శంకరయ్య మాట్లాడుతూ.. పిల్ల బుచ్చయ్య పార్టీకి, ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 2వ వార్డు కౌన్సిలర్ పోలపల్లి లక్ష్మీ ముత్తయ్య, బూత్ అధ్యక్షుడు బాతురాజు ప్రవీణ్, సీనియర్ నాయకులు పర్నే అంజిరెడ్డి, రమణగొని నరసింహ, తూర్పునూరి నరసింహ, ఊదరి రంగయ్య, ఎర్రగోని మల్లేశం, పోలపల్లి భాస్కర్, ఎర్ర నరసింహ, పిల్ల యాదయ్య, పిల్ల శ్రీకాంత్, పిల్ల సురేష్, పిల్ల శ్రీధర్, కోయిలగూడెం రవిచంద్ర, శ్రీశైలం, గుండపల్లి వెంకటరెడ్డి, రమేష్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



## మొగిలిపాకలో వాటర్ ఫిల్టర్ ప్రారంభం

- ప్రజారోగ్య పరిరక్షణకు మరో ముందడుగు
- సొంత నిధులతో సామగ్రి సమకూర్చిన మాజీ దేవస్థానం చైర్మన్ కిరణ్‌కుమార్‌రెడ్డి

**తొలివెలుగు, వలిగొండ:** వలిగొండ మండలం మొగిలిపాక గ్రామంలోని ఎస్సీ కాలనీ ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్‌ను ప్రారంభించారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ ముద్దసాని కిరణ్‌కుమార్‌రెడ్డి తన సొంత నిధులతో వాటర్ ఫిల్టర్‌కు అవసరమైన సామగ్రిని సమకూర్చి, కాలనీ ప్రజల వినియోగానికి అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి తన వంతు సహకారం అందించడం సంతోషంగా ఉందన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు స్వచ్ఛమైన తాగునీరు ఎంతో అవసరమని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ఇలాంటి ప్రజోపయోగ కార్యక్రమాలకు తన సహకారం కొనసాగిస్తానని తెలిపారు. ఎస్సీ కాలనీలో వాటర్ ఫిల్టర్ ఏర్పాటుతో స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి రావడంపై కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. సొంత నిధులతో ఫిల్టర్ ఏర్పాటుకు సహకరించిన ముద్దసాని కిరణ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జడిగే బుచ్చయ్య, ఉపసర్పంచ్ షేక్ సైదుల్, వార్డు సభ్యులు పబ్బు వెంకటేష్, మచ్చ అండాలు, పబ్బు శిరీష-బాలు, మచ్చ స్వామి-సునీత, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు భీమనబోయిన బిక్షపతి, మాజీ సర్పంచ్ జక్కుల శంకరయ్య, మాజీ ఉపసర్పంచ్‌లు విష్ణుచారి, భీమనబోయిన నర్సింహా, పాల సెంటర్ చైర్మన్ అమిరిశెట్టి శ్రీను, పాల సంఘం డైరెక్టర్లు జడిగే మల్లయ్య, సింగం మహేష్, జడిగే గోపాల్, మాజీ పాల సంఘం చైర్మన్లు పబ్బు సత్తయ్య, మద్ది పాండురెడ్డి, మర్ల నర్సింహాతో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## చలో ఇందిరాపార్క్‌ను జయప్రదం చేయండి

- పెండింగ్ ప్రాజెక్టులకు నిధుల సాధనే లక్ష్యం
- భువనగిరి నుంచి ఇందిరాపార్క్ వరకు మూడు రోజుల పాదయాత్ర
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ జహంగీర్ పిలుపు



**తొలివెలుగు, వలిగొండ:** జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు నిధులు సాధించేందుకు సీపీఎం ఆధ్వర్యంలో చేపడుతున్న పోరాటాల్లో భాగంగా ఆగస్టు 31న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే చలో ఇందిరాపార్క్ మహాధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ జహంగీర్ ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని పులిగిల్ల గ్రామంలో నిర్వహించిన సీపీఎం జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు విడుదల చేయాలని సీపీఎం ఇప్పటికే అనేక రూపాల్లో పోరాటాలు నిర్వహించిందన్నారు. ప్రభుత్వం నిధుల విడుదల విషయంలో నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపిస్తూ ఆగస్టు 29, 30, 31 తేదీల్లో భువనగిరి నుంచి హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాదయాత్ర ముగింపులో ఆగస్టు 31న ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. జిల్లాలోని కరువు ప్రాంతాల్లో సాగునీటి సమస్యను పరిష్కరించే ఉద్దేశంతో ప్రారంభించిన ప్రాజెక్టులు, కాలువల పనులు దశాబ్దాలు గడుస్తున్నా పూర్తికావడం లేదని జహంగీర్ విమర్శించారు. పాలకులు మారుతున్నా రైతులకు సాగునీరు అందించే విషయంలో మాత్రం పరిస్థితి మారడం లేదన్నారు. సీపీఎం పోరాటాల నేపథ్యంలో నిధులు విడుదల చేస్తున్నట్లు ప్రభుత్వాలు ప్రకటించినప్పటికీ, అవి ప్రకటనలకే పరిమితమయ్యాయని ఆరోపించారు. పెండింగ్ ప్రాజెక్టులకు వెంటనే నిధులు విడుదల చేసి పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగట్టేందుకే భువనగిరి అంబేద్కర్ చౌరస్తా నుంచి ఇందిరాపార్క్ వరకు మూడు రోజుల పాటు పాదయాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆగస్టు 31న జరిగే మహాధర్నాలో ప్రజలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాటూరి బాలరాజు, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, జిల్లా కమిటీ సభ్యుడు గణపతి రెడ్డి, మాజీ సర్పంచ్, సీనియర్ నాయకుడు కొమ్మిడి లక్ష్మారెడ్డి, పీఎన్ఎం జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు, మండల కార్యదర్శివర్గ సభ్యుడు వాకిటి వెంకటరెడ్డి, శాఖ సహాయ కార్యదర్శి వేముల నాగరాజు, సీనియర్ నాయకులు దొడ్డి బిక్షపతి, వరికుప్పల యాదయ్య, వడ్డెమాన్ వెంకటయ్య, కొమ్మిడి సత్తిరెడ్డి, వనం యాదయ్య, ఈర్ల రమేష్, వడ్డమాని రవి, వరికుప్పల బాబు, వడ్డెమాని మధు, సందెల లింగస్వామి, శ్రీశైలం, వెంకటేశం, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మొగిలిపాకలో వాటర్ ఫిల్టర్ ప్రారంభం

- ప్రజారోగ్య పరిరక్షణకు మరో ముందడుగు
- సొంత నిధులతో సామగ్రి సమకూర్చిన మాజీ దేవస్థానం చైర్మన్ కిరణ్‌కుమార్‌రెడ్డి

**తొలివెలుగు, వలిగొండ:** వలిగొండ మండలం మొగిలిపాక గ్రామంలోని ఎస్సీ కాలనీ ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్‌ను ప్రారంభించారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ ముద్దసాని కిరణ్‌కుమార్‌రెడ్డి తన సొంత నిధులతో వాటర్ ఫిల్టర్‌కు అవసరమైన సామగ్రిని సమకూర్చి, కాలనీ ప్రజల వినియోగానికి అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి తన వంతు సహకారం అందించడం సంతోషంగా ఉందన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు స్వచ్ఛమైన తాగునీరు ఎంతో అవసరమని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ఇలాంటి ప్రజోపయోగ కార్యక్రమాలకు తన సహకారం కొనసాగిస్తానని తెలిపారు. ఎస్సీ కాలనీలో వాటర్ ఫిల్టర్ ఏర్పాటుతో స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి రావడంపై కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. సొంత నిధులతో ఫిల్టర్ ఏర్పాటుకు సహకరించిన ముద్దసాని కిరణ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జడిగే బుచ్చయ్య, ఉపసర్పంచ్ షేక్ సైదుల్, వార్డు సభ్యులు పబ్బు వెంకటేష్, మచ్చ అండాలు, పబ్బు శిరీష-బాలు, మచ్చ స్వామి-సునీత, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు భీమనబోయిన బిక్షపతి, మాజీ సర్పంచ్ జక్కుల శంకరయ్య, మాజీ ఉపసర్పంచ్‌లు విష్ణుచారి, భీమనబోయిన నర్సింహా, పాల సెంటర్ చైర్మన్ అమిరిశెట్టి శ్రీను, పాల సంఘం డైరెక్టర్లు జడిగే మల్లయ్య, సింగం మహేష్, జడిగే గోపాల్, మాజీ పాల సంఘం చైర్మన్లు పబ్బు సత్తయ్య, మద్ది పాండురెడ్డి, మర్ల నర్సింహాతో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# హెజీలో ఫార్మాలో అగ్నిప్రళయం

- రియాక్టర్ పేలి కార్మికుడు నాగిరెడ్డి మృతి
- 10 మందికి తీవ్ర గాయాలు.. నిమిషాల్లో ముంచెత్తిన మంటలు
- ఇద్దరి పరిస్థితి విషమం.. హైదరాబాద్ కు తరలింపు
- నెలన్నర వ్యవధిలోనే మరో ఘోరం.. యాజమాన్య నిర్లక్ష్యమే కారణమా?
- భయాందోళనలో పరిసర గ్రామాల ప్రజలు







**తొలివెలుగు, చౌటుప్పల్:** యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం దోతిగూడెం శివారులోని 'హేజిలో ల్యాబొరేటరీస్' కెమికల్ పరిశ్రమలో శుక్రవారం రాత్రి భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఫార్మా కంపెనీల్లో భద్రతా ప్రమాణాలు మృగ్యమవడం వల్ల మరో కార్మికుడు ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. ఈ దుర్ఘటనలో నాగిరెడ్డి అనే కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందగా, 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి అత్యంత విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం వారిని వెంటనే హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మిగతా క్షతగాత్రులకు భూదాన్ పోచంపల్లి, చౌటుప్పల్, ఉమ్మడి నల్గొండ పరిసర ఆసుపత్రుల్లో చికిత్స అందిస్తున్నారు.

**నైట్ షిఫ్ట్‌లో ఊహించని విపత్తు:**


పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హేజిలో కంపెనీలోని సీ-బ్లాక్‌లో రాత్రి నైట్ షిఫ్ట్‌లో సుమారు 18 మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా కెమికల్ రియాక్టర్ భారీ శబ్దంతో పేలిపోవడంతో మంటలు క్షణాల్లో వ్యాపించాయి. పేలుడు ఉధృతికి నాగిరెడ్డి తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయాడు. అగ్నిమాపక, పోలీస్ సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులకు ప్రాథమిక సహాయం అందించి ఆసుపత్రులకు తరలించారు. రియాక్టర్ పేలుడుకు సాంకేతిక లోపమా లేక నిర్వహణ లోపమా అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**భద్రత సున్నా.. ప్రాణాలకు లేదు గ్యారెంటీ!**

హేజీలో ల్యాబొరేటరీస్‌లో భద్రతా చర్యలను యాజమాన్యం గాలికి వదిలేసిందనే తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత జూలై 16న రసాయన విషవాయువులు పీల్చడంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా సింగనమల మండలం ఉల్లికల్లుకు చెందిన అలుమూరు కృష్ణారెడ్డి (42) అనే కార్మికుడు మృతి చెందాడు. ఆ ప్రమాదం జరిగి రెండు నెలలు కూడా కాకముందే మళ్లీ భారీ రియాక్టర్ పేలుడు సంభవించడం యాజమాన్య వైఫల్యానికి నిదర్శనమని స్థానికులు మండిపడుతున్నారు. పదేపదే ప్రమాదాలు జరుగుతున్నా అధికారుల పర్యవేక్షణ కొరవడిందనే ఆరోపణలు వస్తున్నాయి.

**ఉలిక్కిపడ్డ పరిసర గ్రామాలు:**

రియాక్టర్ పేలుడు ధాటికి వచ్చిన భారీ శబ్దంతో దోతిగూడెం, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురై ఒక్కసారిగా రోడ్లపైకి పరుగులు తీశారు. ప్రమాద వార్త తెలుసుకుని కార్మికుల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కంపెనీ ఎదుట భారీగా గుమిగూడారు. పరిశ్రమల వల్ల తమ ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోందని, నిబంధనలు పాటించని యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు.





## ఏసీబీ వలలో పంచాయతీ కార్యదర్శి

- ఇంటి నిర్మాణ అనుమతికి రూ.15 వేలు డిమాండ్ చేసినట్లు ఆరోపణ
- రూ.13 వేలు ఫోన్‌పే చేయించుకున్న వ్యవహారంలో అదుపులోకి
- ఆదిలాబాద్ ఏసీబీ డీఎస్పీ మధు ఆధ్వర్యంలో దాడులు

**తొలివెలుగు, జన్నారం:** మంచిర్యాల జిల్లా జన్నారం మండలం లింగయ్యపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి బి. వరలక్ష్మి ఏసీబీ వలలో చిక్కారు. ఇంటి నిర్మాణ అనుమతి కోసం లంచం డిమాండ్ చేసినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం ఏసీబీ అధికారులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఆదిలాబాద్ ఏసీబీ డీఎస్పీ జి. మధు ఆధ్వర్యంలో ఈ దాడులు నిర్వహించారు. లింగయ్యపల్లి గ్రామానికి చెందిన సందేవేణి తిరుపతి ఇంటి నిర్మాణ అనుమతి కోసం పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి రూ.15 వేలు డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఈ వ్యవహారంపై బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో, వారి సూచనల మేరకు రూ.13 వేలను పంచాయతీ కార్యదర్శి సూచించిన మరో వ్యక్తి ఖాతాకు ఫోన్‌పే ద్వారా బదిలీ చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు. అనంతరం ఏసీబీ అధికారులు గ్రామ పంచాయతీ కార్యాలయానికి చేరుకుని సంబంధిత రికార్డులను పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి బి. వరలక్ష్మిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితురాలిని కరీంనగర్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నట్లు ఆదిలాబాద్ ఏసీబీ డీఎస్పీ జి. మధు వెల్లడించారు.





## మానవత్వం చాటుకున్న పీసీఆర్ ఫౌండేషన్

- నిరాదరణకు గురైన వ్యక్తికి గుండు చేయించి.. కొత్త దుస్తులు, భోజనం అందజేత

**తొలివెలుగు, జన్నారం:** పీసీఆర్ (పూర్ణచంద్రరావు) ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మానవత్వాన్ని చాటుకునే సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. పొనకల్ పట్టణంలో మతిస్థిమితం సరిగా లేని ఓ వ్యక్తిని గుర్తించిన ఫౌండేషన్ సభ్యులు అతడికి ఆప్యాయతతో సేవలు అందించారు. ఆ వ్యక్తికి గుండు చేయించి, పరిశుభ్రంగా తయారు చేసిన అనంతరం కొత్త దుస్తులు అందజేశారు. అనంతరం భోజనం ఏర్పాటు చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. సమాజంలో నిరాదరణకు గురవుతున్న వారికి అండగా నిలిచి, తమ వంతు సేవ చేయడమే పీసీఆర్ ఫౌండేషన్ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. అవసరంలో ఉన్న వారికి చేయూతనందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ముడుగు ప్రవీణ్, ఫౌండేషన్ సభ్యులు మున్వర్ అలీ ఖాన్, నోముల రాజ్‌కుమార్, దేవయ్య, కొత్త శ్రీనివాస్, పుత్తూరి శ్రీనివాస్, బెడద గోపాల్, సాయి, గోలి చందు తదితరులు పాల్గొన్నారు.






# కార్మికుల హక్కుల కోసం ఉద్యమిద్దాం

- కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలి: ఎండీ ఇమ్రాన్
- వలిగొండ ఏఐటీయూసీ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**తొలివెలుగు, వలిగొండ:** కార్మికులు తమ హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ పిలుపునిచ్చారు. వలిగొండ మండల కేంద్రంలోని దేవిశ్రీ గార్డెన్స్‌లో శుక్రవారం నిర్వహించిన ఏఐటీయూసీ మూడో మండల మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బ్రిటిష్ పాలన కాలం నుంచి కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటిని నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడం కార్మికుల హక్కులను బలహీనపరిచే చర్య అని విమర్శించారు. కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్మికులకు కనీస వేతన చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని ఏఐటీయూసీ డిమాండ్ చేస్తోందన్నారు. అసంఘటిత, సంఘటిత రంగాల కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కార్మికులు ఐక్యంగా పోరాడాలని సూచించారు.

**ఏఐటీయూసీ నూతన కమిటీ ఎన్నిక:**

మహాసభ అనంతరం వలిగొండ మండల ఏఐటీయూసీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కనకబోయిన ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా ఎల్లంకి మహేష్ ఎన్నికయ్యారు. మండల కార్యవర్గ సభ్యులుగా కందుకూరి సంజీవ, ఐలపాక స్వామి, నానంచర్ల వెంకటేష్, గడ్డల నరసింహ, బొలుగుల రామ్మూర్తి, కసరబోయిన మహేష్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు పలువురు అభినందనలు తెలిపారు.

# బ్లూకాలర్ బూమ్!

ఒకప్పుడు డిగ్రీ ఉంటేనే భవిష్యత్ అనేవారు. ఇప్పుడు నైపుణ్యం ఉన్నవారికే భవిష్యత్ అనే కొత్త వాస్తవం రూపుదిద్దుకుంటోంది. ఏఐ యుగంలో ఉద్యోగాలు అంతరించిపోవడం కాదు, వాటి స్వరూపం మారుతోంది. కంప్యూటర్‌ను ఆదేశించే వ్యక్తికన్నా ఆ కంప్యూటర్ పనిచేసే వ్యవస్థను నిర్మించే, నిర్వహించే ఎలక్ట్రీషియన్, టెక్నీషియన్, రోబోటిక్స్ నిపుణులే రేపటి ఉద్యోగ మార్కెట్‌లో అత్యంత విలువైన వ్యక్తులుగా నిలవనున్నారు. కృత్రిమ మేధ (ఏఐ) ప్రపంచాన్ని వేగంగా మార్చేస్తున్న వేళ మరో కీలక పరిణామం నిశ్శబ్దంగా చోటుచేసుకుంటోంది. కంప్యూటర్ ముందు కూర్చునే ఉద్యోగాలకంటే చేతివృత్తులు, సాంకేతిక నైపుణ్యాలున్న బ్లూకాలర్ ఉద్యోగాలకు ఇప్పుడు భారీ డిమాండ్ ఏర్పడుతోంది. ఎలక్ట్రీషియన్స్, ప్లంబర్లు, రోబోటిక్స్ టెక్నీషియన్లు, హెచ్‌వీఏసీ నిపుణులు, యంత్రాల నిర్వహణ సిబ్బంది వంటి వృత్తి నిపుణుల కోసం కంపెనీలు పోటీ పడుతున్నాయి. ఏఐ విప్లవం వెనక అసలు బలం మానవ నైపుణ్యాలేనని తాజా అధ్యయనం స్పష్టం చేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఏఐ, డేటా సెంటర్లు, ఆటోమేటెడ్ ఫ్యాక్టరీలు వేగంగా విస్తరిస్తున్నాయి. ఇవన్నీ సక్రమంగా పనిచేయాలంటే భారీ విద్యుత్ వ్యవస్థలు, శీతలీకరణ యంత్రాంగం, రోబోటిక్ పరికరాలు, నిర్వహణ సిబ్బంది అవసరం. అందుకే ఎలక్ట్రీషియన్లు, మెకానిక్‌లు, వెల్డర్లు, ప్లంబర్లు, రోబోటిక్స్ నిపుణుల అవసరం ప్రపంచవ్యాప్తంగా గణనీయంగా పెరుగుతోంది. టాలెంట్ సంస్థ రాండ్‌స్టాడ్ విశ్లేషణ ప్రకారం 5 కోట్లకు పైగా ఉద్యోగ ప్రకటనలను పరిశీలించి విశ్లేషించగా గత నాలుగేళ్లలో ఎలక్ట్రిషియన్ల డిమాండ్ 242%, హెచ్‌వీఏసీ టెక్నీషియన్ల డిమాండ్ 200%, రోబోటిక్స్ టెక్నీషియన్ల అవసరం గణనీయంగా పెరిగినట్లు తేలింది. 2022 నుంచి 2026 మధ్య కాలంలో భారత దేశంలో బ్లూకాలర్ ఉద్యోగాల సంఖ్య 93% పెరిగింది. అదే సమయంలో వైట్ కాలర్ ఉద్యోగాల వృద్ధి 40% వద్దే నిలిచింది. ఇది దేశ కారి?మక మార్కెట్లో పెద్ద మార్పునకు సంకేతంగా నిపుణులు భావిస్తున్నారు. ఇప్పటివరకు డిగ్రీ, ఐటీ ఉద్యోగాలకే ప్రాధాన్యం ఉండేది. కానీ ప్రస్తుతం పరిశ్రమలు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, డేటా సెంటర్లు, సెమీకండక్టర్ యూనిట్లు, ఎలక్టిక్ వెహికిల్ (ఈవీ) తయారీ కేంద్రాలు పెరగడంతో సాంకేతిక నైపుణ్యాలున్న కార్మికుల అవసరం మరింత పెరిగింది.

ఉద్యోగాల్లోనే కాదు వేతనాల్లో కూడా బ్లూకాలర్ ఉద్యోగులు ముందంజలో ఉన్నారు. బ్లూకాలర్ ఉద్యోగుల జీతాలు ఏటా సగటున 5.7 శాతం పెరుగుతున్నాయి. ఎంట్రీ లెవెల్ వైట్ కాలర్ ఉద్యోగాల్లో పెరుగుదల 4 శాతం మాత్రమే నమోదైంది. రోబోటిక్స్ నిర్వహణ, ప్రత్యేక యంత్రాల మెయింటినెన్స్ మెకానిక్‌ల వార్షిక వేతనం సగటున రూ. 8లక్షలకు పైగా ఉండగా ప్లాంట్ ఆపరేటర్లు రూ.7 లక్షలు, నిర్మాణ రంగ సిబ్బంది రూ.5 లక్షలు, ఎలక్ట్రీషియన్లు సుమారు రూ.3 లక్షలకుపైగా సంపాదిస్తున్నారు. దీనికి విరుద్ధంగా డేటా ఎంట్రీ ఆపరేటర్లు, జూనియర్ అకౌంటింగ్ వంటి ఎంట్రీ లెవెల్ ఉద్యోగాల్లో వేతనాలు తక్కువగా ఉండడమే కాకుండా వారిపై ఆటోమేషన్ ప్రభావం కూడా ఎక్కువగా కనిపిస్తోంది. అమెరికా, యూరప్ వంటి దేశాల్లోని కంపెనీల్లో కార్యాలయ ఉద్యోగాలు తగ్గుతున్నప్పటికీ భారత్‌లో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. ఒకవైపు బ్లూకాలర్ ఉద్యోగాలు వేగంగా పెరుగుతుండగా, మరోవైపు వైట్ కాలర్ రంగంలోనూ 40 శాతం వృద్ధి నమోదవుతోంది.అయితే భవిష్యత్తులో డేటా ఎంట్రీ, ప్రాథమిక అకౌంటింగ్, సాధారణ పరిపాలనా ఉద్యోగాలపై మాత్రం ఏఐ ప్రభావం ఉండొచ్చని హెచ్చరికలు వినిపిస్తున్నాయి. రాండ్‌స్టాండ్ సీఈఓ విశ్వనాథ్ పీఎస్ అభిప్రాయం ప్రకారం ‘ ప్రతి ఏఐ ఆవిష్కరణ వెనక ఒక భౌతిక వ్యవస్థ ఉంటుంది. విద్యుత్ గ్రిడ్లు అప్ గ్రేడ్ కావాలి, కూలింగ్ సిస్టమ్‌లు నిర్మించాలి, ఫ్యాక్టరీలు ఆటోమేట్ కావాలి, ప్రతి స్మార్ట్ యంత్రం వెనక అత్యంత నైపుణ్యం కలిగిన మనుషులే ఉంటారు. ఏఐ అంటే కేవలం సాఫ్ట్‌వేర్ మాత్రమే కాదు, దానికి భారీ మౌలిక సదుపాయాలు అవసరం. ఉదాహరణకు డేటా సెంటర్లకు అధిక విద్యుత్ సరఫరా అవసరం సర్వర్లను చల్లబరిచేందుకు భారీ హెచ్‌వీఏసీ(హీటింగ్, వెంటిలేషన్, ఎయిర్ కండిషన్) వ్యవస్థలు కావాలి. తయారీ రంగంలో రోబోట్ల వినియోగం పెరుగుతోంది. ఈవీ పరిశ్రమల్లో ఆటోమేటెడ్ అసెంబ్లీ లైన్లు విస్తరిస్తున్నాయి.


# అమ్మో.. భారత మార్కెట్లా!




న్యూఢిల్లీ, ఆగస్టు 20: దేశీయ స్టాక్ మార్కెట్లను చూసి ఫండ్ మేనేజర్లు బెంబేలెత్తిపోతున్నారు. తీవ్ర ఒడిదుడుకులతో మదుపర్లు ఆందోళనలోపడ్డారు మరి. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో భారతీయ స్టాక్ మార్కెట్లు ఎక్కువగా అమ్మకాల ఒత్తిడికి గురవుతున్నాయి. గత 6 నెలలుగా స్థిరత్వం లోపించడంతో కొత్త పెట్టుబడులకు జంకే పరిస్థితులు ఏర్పడ్డాయి. బ్యాంక్ ఆఫ్ అమెరికా కార్పొరేషన్ నిర్వహించిన ఫండ్ మేనేజర్ల తాజా సర్వేలోనూ ఇదే తేలింది. ఆసియా దేశాల్లో ఇప్పుడు మదుపర్లకు అత్యల్ప ప్రాధాన్యత కలిగిన ఈక్విటీ మార్కెట్లు భారత్‌వేనని ఇందులో తేలడం గమనార్హం. ఈ నెల 7-13 మధ్య జరిగిన ఈ సర్వేలో మొత్తం 98 మంది ప్యానెల్ సభ్యులు పాల్గొన్నారు. కాగా, బ్లూమ్‌బర్గ్ వివరాల ప్రకారం.. వివిధ దేశాల స్టాక్ మార్కెట్లలో 272 బిలియన్ డాలర్ల ఆస్తులను వీరు నిర్వహిస్తున్నారు. ఇక ఆయా ప్రశ్నలకు వీరిచ్చిన సమాధానాల ఆధారంగానే సర్వే ఫలితాలు విడుదలయ్యాయి. ఈ క్రమంలోనే పెట్టుబడులకు సంబంధించి మదుపర్లకున్న ప్రాధాన్యంలో ఇండోనేషియా కంటే దిగువన మైనస్ 32 శాతంతో భారతీయ స్టాక్ మార్కెట్లు నిలిచాయి. 2025దాకా వరుసగా 10 ఏండ్లపాటు మదుపర్లకు లాభాలను పంచిన భారతీయ స్టాక్ మార్కెట్లు.. ఈ ఏడాది మాత్రం ఆ ఉత్సాహాన్ని ప్రదర్శించలేకపోతున్నాయి. ఇటీవలికాలంలో కృత్రిమ మేధస్సు (ఏఐ)ను అందిపుచ్చుకోవడంలో జరుగుతున్న జాప్యం సైతం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నట్టు చెప్తున్నారు. సెమీకండక్టర్, మెమరీ, ఇతర టెక్నాలజీల షేర్ల మద్దతుతో దక్షిణ కొరియా స్టాక్ మార్కెట్లలో సుమారు 60 శాతం ర్యాలీ కనిపిస్తున్నదంటే.. ఏఐపట్ల ఇన్వెస్టర్లలో ఏ స్థాయిలో ఆసక్తి నెలకొన్నదో అర్థం చేసుకోవచ్చు. కానీ భారత్‌లో ఈ రకమైన వాతావరణం లేకపోవడం ప్రతికూలంగా మారుతున్నదంటున్నారు. ఇది సంస్కరణల అమలులో కేంద్ర ప్రభుత్వం అలసత్వాన్ని కూడా ఎత్తిచూపుతున్నది. ఫలితంగా ఆసియాలో నాల్గో అతిపెద్ద ఈక్విటీ మార్కెట్‌గా ఉన్న భారత్‌లో ఈ తరహా పాలన సరికాదన్న అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయిప్పుడు ఇక భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తకర పరిస్థితులు, అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో అనిశ్చితి, బాండ్ మార్కెట్‌లో ఆకర్షణీయ రాబడులు కూడా స్టాక్ మార్కెట్లను మదుపర్లకు దూరం చేస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటున్న దుందుడుకు నిర్ణయాలు సైతం భారత్‌ను ప్రభావితం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే గత ఏడాది ముగింపుతో చూస్తే.. ఈ ఏడాదిలో ఇప్పటిదాకా సెన్సెక్స్ 7,682.88 పాయింట్లు, నిఫ్టీ 1,897.75 పాయింట్లు పడిపోయాయి. జనవరిలో నిఫ్టీ ఆల్‌టైమ్ హై రికార్డులకు చేరినా నిలుపుకోలేకపోయింది.

# చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీ





- రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరుపై సమీక్ష
- ప్రజలతో మర్యాదగా వ్యవహరించి వేగవంతమైన సేవలు అందించాలి: ఎస్పీ అక్షాంశ్ యాదవ్

**తొలివెలుగు, చౌటుప్పల్:** యాదాద్రి భువనగిరి జిల్లా పోలీస్ శాఖలో వృత్తిపరమైన పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ ఐపీఎస్ చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని జనరల్ డైరీ (జీడీ) ఎంట్రీలు, సీసీటీఎన్ఎస్ పనితీరు, వివిధ రిజిస్టర్లు, రికార్డులు, డిజిటల్ ఎంట్రీలు, పోలీస్ స్టేషన్ నిర్వహణ తదితర అంశాలను ఎస్పీ సమగ్రంగా పరిశీలించారు. రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరు, మొత్తం స్టేషన్ కార్యకలాపాలను సమీక్షించారు. అన్ని చట్టబద్ధమైన రికార్డులు, రిజిస్టర్లు, డిజిటల్ ఎంట్రీలను కచ్చితంగా, క్రమబద్ధంగా, ఎప్పటికప్పుడు నవీకరించి నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. పారదర్శకత, జవాబుదారీతనం, సమర్థవంతమైన పోలీసింగ్‌కు సరైన రికార్డుల నిర్వహణ అత్యంత కీలకమని సూచించారు.

**ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలి:**

పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారు, సందర్శకుడితో ఓర్పుగా, గౌరవప్రదంగా, స్నేహపూర్వకంగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. ప్రజల సమస్యలను సానుభూతితో విని, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా వాటి పరిష్కారానికి వేగంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి:**

సోషల్ మీడియా వేదికలను సమర్థవంతంగా వినియోగించి ప్రజల్లో నేరాలపై అవగాహన పెంచాలని సూచించారు. ముఖ్యంగా సైబర్ మోసాలు, నేరస్తులు అనుసరిస్తున్న కొత్త పద్ధతులు, ఇతర నేరాల తీరు, వాటి నుంచి రక్షించుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. నేరం జరిగిన తర్వాత స్పందించడమే కాకుండా, నేరాలను ముందుగానే నివారించేందుకు చర్యలు చేపట్టడం ఆధునిక పోలీసింగ్‌లో కీలకమని ఎస్పీ అన్నారు. ప్రజలతో సమన్వయం పెంపొందించడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించడం, నిరంతరం అవగాహన కల్పించడం ద్వారా నేరాల నివారణకు కృషి చేయాలని సూచించారు. క్రమశిక్షణ, నిజాయితీ, వృత్తి నైపుణ్యం, సమగ్ర రికార్డుల నిర్వహణ, ప్రజల పట్ల మర్యాదపూర్వక ప్రవర్తన సమర్థవంతమైన పోలీసింగ్‌కు ప్రాథమిక సూత్రాలని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రతి పోలీస్ సిబ్బంది పూర్తి బాధ్యత, అంకితభావం, వృత్తి నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ఈ ఆకస్మిక తనిఖీ సందర్భంగా డీఎస్పీ మధుసూదన్‌రెడ్డి, సీఐ మన్మథ్‌కుమార్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు.. రెండు వారాల్లో అమలు చేస్తారా..?

చాలా రోజులుగా ప్రచారం జరుగుతున్నట్లు యూపీఐ లావాదేవీలపై త్వరలోనే ఛార్జీలు అమలు కాబోతున్నాయి. అవి మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్)కు సంబంధించిన ఛార్జీలు. ఈ విధానం రెండు వారాల్లోగా అమలులోకి వచ్చే అవకాశం ఉంది. దీనికి సంబంధించి వారంలోపే అధికారిక నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని ఆర్థిక వ్యవహారాల శాఖ వర్గాలు తెలిపాయి. అయితే, ఈ విషయంలో యూపీఐ వినియోగదారులు కంగారు పడాల్సిన అవసరం లేదు. ఈ విధానం అమలైతే వారిపై ఎలాంటి ఛార్జీలు ఉండవు. ఇది ఎండీఆర్. అంటే, వ్యాపారస్తులపై మాత్రమే ఛార్జీలు విధిస్తారు. రూ.2,000 లేదా అంతకంటే ఎక్కువ విలువ కలిగిన లావాదేవీలపై మాత్రమే విధించే ఛార్జి ఇది. అది కూడా 0.3 శాతం. డిజిటల్ పేమెంట్ స్వీకరించే వ్యాపారులే దీన్ని చెల్లించాల్సి ఉంటుంది. అలాగే, ఇతర ఎలక్ట్రానిక్ పేమెంట్లపై ఎలాంటి ఛార్జీ ఉండదు. ఎండీఆర్ అంటే ప్రతి లావాదేవీపై వ్యాపారులు బ్యాంకులకు లేదా సర్వీస్ ప్రొవైడర్లకు చెల్లించే ఫీజు. ఈ విధానం గతంలో అమలులో ఉండేది. కానీ, యూపీఐ, డిజిటల్ పేమెంట్లను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కేంద్రం 2020లో ఎండీఆర్‌ను రద్దు చేసింది. మరో వారంలో దీనిపై గెజిట్ నోటిఫికేషన్ వెలువడనుంది. ఒకసారి నోటిఫికేషన్ వచ్చిన తర్వాత యూపీఐ అండ్ సర్వీస్ స్టీరింగ్ కమిటీ అయిన నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) తగిన విధి విధానాలు ఖరారు చేస్తుంది. ఎండీఆర్ అమలును వ్యాపారస్తులు వ్యతిరేకిస్తుంటే, బ్యాంకర్లు సమర్థిస్తున్నారు. ప్రస్తుతం దేశంలో మొత్తం డిజిటల్ లావాదేవీలలో 85 శాతం ట్రాన్సాక్షన్స్ యూపీఐ ద్వారానే జరిగాయి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.314.23 లక్షల కోట్ల విలువైన 241.62 బిలియన్ ట్రాన్సాక్షన్స్ జరిగాయి. ఇలా భారీ స్థాయిలో జరిగే చెల్లింపుల కోసం సర్వర్లు, నెట్‌వర్క్ సెక్యూరిటీ వంటి అంశాల నిర్వహణ బ్యాంకులకు తలకుమించిన భారంగా మారింది. వాటికి ఆర్థిక భారం అవుతోంది. అందుకే, ఈ భారం తగ్గాలంటే ఎండీఆర్ అమలు చేయాలని బ్యాంకులు ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నాయి.






## నట విదుషీమణి షావుకారు జానకి..

# చెన్నైలో కన్నుమూసిన దిగ్గజ తార

దేశం గర్వించదగ్గ నటీమణి, అభినయతార పద్మశ్రీ షావుకారు జానకి(94) కన్నుమూశారు. చెన్నైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆమె తుదిశ్వాస విడిచారు. గత కొంతకాలంగా వృద్ధాప్య సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారామె. కొన్ని రోజుల క్రితం శ్వాసకోశ సంబంధిత సమస్యలు కూడా తలెత్తడంతో ఆమెను చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బుధవారం నుంచి ఆమె ఆరోగ్యం ఆందోళనకరంగా మారింది. ఈ క్రమంలో శుక్రవారం షావుకారు జానకి కన్నుమూశారు.



షావుకారు జానకి పూర్వీకులది కర్ణాటక. ఆంధ్రప్రదేశ్ రాజమహేంద్రవరంలో సెటిల్ అయ్యారు. అక్కడే 1931 డిసెంబర్ 12న షావుకారు జానకి జన్మించారు. ఆమె అసలు పేరు టేకుమళ్ల జానకి. సద్బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారామె. తండ్రి టేకుమళ్ల వెంకూజీరావు విప్లవభావాలు కలిగిన వ్యక్తి.. ఉన్నత విద్యావంతుడు. తండ్రి బాటలోనే జానకి కూడా విప్లవభావాలతోనే ఎదిగారు. అంతేకాదు.. తండ్రి లాగే తాను కూడా ఉన్నత విద్యావంతురాలే. ఆ రోజుల్లోనే గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు జానకి. స్వాతంత్ర్యోద్యమంలో కూడా ఆమె పాలుపంచుకున్నారు. రాజమండ్రిలోని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ కళాశాలలో ఆమె చదువుకున్న రోజుల్లో హిందీ ప్రచారసభకు గాంధీజీ వచ్చారు. ఆయనకు భోజనం, వసతి చూసుకునే బాధ్యతను స్కూల్ యాజమాన్యం జానకికి అప్పగించారు. అలా గాంధీ, నెహ్రూ, బాబూ రాజేంద్రప్రసాద్ వంటి మహానాయకుల్ని నేరుగా కలుసుకొని మాట్లాడే అవకాశం జానకికి లభించింది. అలనాటి గ్లామర్ క్వీన్ కృష్ణకుమారి స్వయానా జానకి చెల్లెలే. షావుకారు జానకి తొలినాళ్లలో రేడియో నాటకాల్లో నటించేవారు. పాలగుమ్మి పద్మనాభం రచించిన 'పట్నవాసం' ధారావాహిక రేడియో నాటకం ఆమెకు మంచి పేరు తెచ్చింది. ఆ నాటకంలోని జానకి గొంతు విని, నచ్చి శంకరమంచి శ్రీనివాసరావు ఆమెను వివాహమాడారు. అలా టేకుమళ్ల జానకి కాస్తా శంకరమంచి జానకిగా మారారు. 15ఏండ్ల చిరుప్రాయంలోనే ఆమెకు వివాహమైంది. రేడియో నాటకంలో ఆమె గొంతువినే దర్శక,నిర్మాత బీఎన్‌రెడ్డి 'గుణసుందరి కథ'(1949) సినిమాలో ఆమెకు ఆఫర్ ఇచ్చారు. కానీ ఇంట్లోవారు అంగీకరించకపోవడంతో ఆ సినిమాను సున్నితంగానే తిరస్కరించారు జానకి. అయితే.. అదే ఏడాది 'రక్షరేఖ' చిత్రంలో ఓ చిన్న పాత్ర పోషించారామె. అప్పటికే ఆమెకు ఓ బిడ్డ పుట్టడం, సంసార బాధ్యతలు పెరగడం.. ఇత్యాది కారణాలవల్ల ఇల్లు గడవడం కష్టమైంది. దాంతో.. భర్త అనుమతితోనే సినిమాల్లో నటించేందుకు సిద్ధమయ్యారు. అలా 'షావుకారు'(1950)తో కథానాయికగా తెరంగేట్రం చేశారు. ఆ సినిమాలో ఎన్టీఆర్‌కు జోడీగా నటించారామె. అప్పటికే జానకి అనే నటి ఉండటం వల్ల, దర్శకుడు ఎల్వీ ప్రసాద్ ఆమెకు 'షావుకారు జానకి'గా నామకరణం చేశారు. చివరకు అదే ఆమె పేరుగా మారింది. తన తొలి సినిమా పేరును ఇంటిపేరుగా మార్చుకొని దాదాపు 75ఏండ్ల పాటు చలనచిత్ర నటిగా కొనసాగారు షావుకారు జానకి. కథానాయికగా తొలి సినిమా ఎన్టీఆర్‌తో నటిస్తే.. తొలి ఘన విజయం మాత్రం ఏఎన్నార్‌తో దక్కింది. అక్కినేనికి జోడీగా షావుకారు జానకి నటించిన తొలి సినిమా 'రోజులు మారాయి'(1955). ఆ సినిమా వజ్రోత్సవాలు జరుపుకున్నది. ఈ చిత్రాన్ని తమిళంలో రీమేక్ చేశారు. అయితే.. కథానాయిక పాత్రకు జానకిని కాక, అంజలిని తీసుకున్నారు. ఈ విషయంలో చాలా బాధపడ్డారు షావుకారు జానకి. ఈ విషయాన్ని పలు సందర్భాల్లో గుర్తు చేసుకున్నారామె. నిలువెత్తు ఆత్మాభిమానం ఏ విషయాన్నైనా నిర్మొహమాటంగా చెప్పడం, అవమానాన్ని, అన్యాయాన్ని, నిర్లక్ష్యాన్ని సహించలేకపోవడం షావుకారు జానకి నైజం.



తమిళంలో 'ఒలి విలక్కు'(1968) అనే సినిమాలో కథానాయికగా నటించారు షావుకారు జానకి. ఎమ్జీరామచంద్రన్ కథానాయకుడు. కథలో కీలకమైన ఓ వ్యాంప్ పాత్రను జయలలిత పోషించారు. సినిమా విడుదలకు ఒక రోజు ముందు చిత్రబృందానికి ప్రీమియర్ వేశారు. టైటిల్స్‌లో జయలలిత పేరు ముందు వేయడం చూసి షాకయ్యారు షావుకారు జానకి. ఇందులో కథానాయిక నేనా, జయలలితా? అంటూ ఎమ్జీఆర్‌ని సూటిగా అడిగారు. ఆ చిత్ర దర్శకుడు తాపీ చాణక్య, నిర్మాత వాసన్‌లు సైతం ఆమె ధైర్యాన్ని చూసి నివ్వెరపోయారు. రాత్రికి రాత్రి టైటిల్స్ మార్చారు. ఈ కారణంగా కొన్నేళ్లు షావుకారు జానకితో జయలలిత మాట్లాడలేదు. ఈ విషయాన్ని ఆమే ఓ సందర్భంలో చెప్పారు. ఏ విషయాన్నైనా నిర్మొహమాటంగా మాట్లాడే తత్వం షావుకారు జానకిది. ఆమె తెలుగులో కంటే తమిళంలోనే ఎక్కువ చిత్రాల్లో నటించారు. ఇమేజ్ పరంగా కూడా తమిళనాట ఆమెది సూపర్ స్టార్‌డమ్. ఒక్క బాలచందర్ దర్శకత్వంలోనే దాదాపు 12 సినిమాల్లో కథానాయికగా నటించారామె. ఎన్నో విభిన్నమైన పాత్రలను పోషించారు. ఆమె తమిళంలో నటించిన చాలా సినిమాలు తెలుగులో రీమేక్ అయ్యాయి. అక్కడ జానకి పోషించిన పాత్రలను ఇక్కడ వేరే నటీమణులు పోషించేవారు.

## నయనతార 'మూకుతి అమ్మన్ 2'లో విలన్‌గా రెజీనా.. రూ.100 కోట్ల భారీ బడ్జెట్‌తో క్రేజీ సీక్వెల్!





కోలీవుడ్ స్టార్ హీరోయిన్ నయనతార నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రాల్లో 'మూకుతి అమ్మన్ 2' ఒకటి. 2020లో విడుదలై మంచి విజయాన్ని అందుకున్న దైవభక్తి, ఫాంటసీ అంశాలతో తెరకెక్కిన 'మూకుతి అమ్మన్' సినిమాకు ఇది సీక్వెల్ కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తొలి భాగానికి ఆర్జే బాలాజీ దర్శకత్వం వహించగా, రెండో భాగాన్ని ప్రముఖ నటుడు, దర్శకుడు సుందర్ సి తెరకెక్కిస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం.. ఈ భారీ చిత్రంలో ప్రముఖ నటి రెజీనా కసాండ్రా కీలక పాత్రలో నటించనున్నట్లు తెలుస్తోంది. అంతేకాదు, ఆమె ఈ సినిమాలో ప్రతినాయక పాత్రలో కనిపించబోతున్నట్లు కోలీవుడ్ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ పాత్ర కోసం దర్శకుడు సుందర్ సి ప్రత్యేకంగా ఓ శక్తివంతమైన క్యారెక్టర్‌ను డిజైన్ చేసినట్లు సమాచారం. రెజీనాను ఇప్పటివరకు ప్రేక్షకులు చూడని విధంగా, సరికొత్త లుక్‌లో ఈ సినిమాలో చూపించనున్నారట. నయనతారకు దీటుగా సాగే ఈ పాత్ర కథలో అత్యంత కీలకంగా ఉండబోతుందని టాక్. దీంతో 'మూకుతి అమ్మన్ 2'లో నయనతార వర్సెస్ రెజీనా పోరాటం ఎలా ఉండబోతుందనే ఆసక్తి అభిమానుల్లో పెరిగింది. ఈ సినిమాను ప్రముఖ తమిళ నిర్మాత డాక్టర్ ఇషారి కె. గణేష్ తన వెల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. 'మూకుతి అమ్మన్ 2'ను రూ. 100 కోట్లకు పైగా భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. తొలి భాగంతో పోలిస్తే రెండో భాగంలో విజువల్ ఎఫెక్ట్స్, ఫాంటసీ అంశాలు, యాక్షన్ సన్నివేశాలను మరింత భారీ స్థాయిలో ప్లాన్ చేస్తున్నారని తెలుస్తోంది. సుందర్ సి ఇప్పటికే 'అరణ్మనై' హారర్–కామెడీ ఫ్రాంచైజ్‌తో భారీ విజయాలు అందుకున్నారు. ఫాంటసీ, హారర్, కామెడీ, విజువల్ ఎలిమెంట్స్‌ను ప్రేక్షకులకు నచ్చేలా తెరకెక్కించడంలో ఆయనకు మంచి అనుభవం ఉంది. ఇప్పుడు 'మూకుతి అమ్మన్ 2'ను కూడా అదే స్థాయిలో భారీ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిస్తున్నారని సమాచారం. ఈ సినిమాకు సంబంధించిన మరో ఆసక్తికర విషయం ఏమిటంటే.. థియేట్రికల్ విడుదల తర్వాత స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ వేదిక జియోహాట్‌స్టార్ భారీ మొత్తానికి సొంతం చేసుకున్నట్లు సమాచారం. సినిమా ఫుటేజ్ చూసిన తర్వాతే ఈ డీల్ జరిగినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ఓటీటీ ఒప్పందానికి సంబంధించిన ఆర్థిక వివరాలపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అయినప్పటికీ, సినిమా విడుదలకు ముందే డిజిటల్ హక్కులకు ఇంతటి క్రేజ్ రావడం 'మూకుతి అమ్మన్ 2'పై ఉన్న అంచనాలకు నిదర్శనంగా భావిస్తున్నారు.

## బాలీవుడ్ ఎంట్రీపై భాగ్యశ్రీ బోర్సేకు షాక్..

టాలీవుడ్‌లో తన అందం, నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సేకు సంబంధించిన ఓ బాలీవుడ్ వార్త తాజాగా ఆసక్తికరంగా మారింది. బాలీవుడ్ స్టార్ హీరో ఆదిత్య రాయ్ కపూర్, దర్శకుడు మిలాప్ జవేరీ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న భారీ యాక్షన్ లవ్‌స్టోరీలో భాగ్యశ్రీ హీరోయిన్‌గా ఎంపికైందంటూ గత కొద్దిరోజులుగా జోరుగా ప్రచారం జరిగింది. అయితే ఈ వార్తలపై తాజాగా బాలీవుడ్ నిర్మాణ సంస్థ టీ-సిరీస్ స్పందించింది. ఈ ప్రచారాన్ని టీ-సిరీస్ ప్రతినిధులు అధికారికంగా ఖండించారు. ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోందన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. సినిమాలో హీరోయిన్‌గా ఎవరు నటించబోతున్నారనే విషయాన్ని త్వరలోనే అధికారికంగా వెల్లడిస్తామని తెలిపారు. ఆదిత్య రాయ్ కపూర్, మిలాప్ జవేరీ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న ఈ ప్రాజెక్ట్‌పై ప్రస్తుతం భారీ అంచనాలు ఉన్నాయి. ప్రేమ, యాక్షన్, ఎమోషన్స్ మేళవింపుతో ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు దర్శకుడు మిలాప్ జవేరీ గతంలో వెల్లడించారు. ప్రేమకథలను తెరకెక్కించడంలో తనదైన శైలిని చూపించిన మిలాప్ జవేరీ.. 'మర్జావాన్', 'ఏక్ దివానే కీ దివానియత్' వంటి సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్నారు. ఈసారి ఆదిత్య రాయ్ కపూర్‌తో మరింత ఇంటెన్స్ లవ్‌స్టోరీని తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. భాగ్యశ్రీ బోర్సేకు బాలీవుడ్ కొత్తేమీ కాదు. 'యారియాన్ 2', 'చందు ఛాంపియన్' వంటి చిత్రాల్లో చిన్న పాత్రల్లో కనిపించిన ఆమె.. హీరోయిన్‌గా మాత్రం ఇప్పటివరకు పెద్ద ప్రాజెక్ట్‌లో అవకాశం దక్కించుకోలేదు. ఆదిత్య రాయ్ కపూర్ సినిమా ద్వారా బాలీవుడ్‌లో హీరోయిన్‌గా గ్రాండ్ ఎంట్రీ ఇస్తుందంటూ వచ్చిన వార్తలు కూడా ఇప్పుడు అవాస్తవంగా తేలాయి. భాగ్యశ్రీ బోర్సే రవితేజ నటించిన 'మిస్టర్ బచ్చన్' సినిమాతో టాలీవుడ్‌లోకి హీరోయిన్‌గా అడుగుపెట్టింది. తొలి సినిమాతోనే తన గ్లామర్‌తో పాటు నటనతోనూ తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆ తర్వాత వరుస అవకాశాలు ఆమె తలుపు తట్టాయి.దుల్కర్ సల్మాన్, రానా దగ్గుబాటి, సముద్రఖని కీలక పాత్రల్లో నటించిన తమిళ చిత్రం 'కాంత' లోనూ భాగ్యశ్రీ నటించింది. ఈ సినిమాలో ఆమె నటనకు మంచి స్పందన లభించింది. అక్కినేని అఖిల్ నటించిన 'లెనిన్' చిత్రంలోనూ భాగ్యశ్రీ హీరోయిన్‌గా కనిపించింది. ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ హీరో శివ కార్తికేయన్ సరసన కమల్ హాసన్ నిర్మాణంలో తెరకెక్కుతున్న 'సేయోన్' సినిమాలో నటిస్తోంది.



Printed, Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com